ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 14.08.2026 | సంపుటి : 13 సంచిక : 25 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

**నియోజకవర్గానికి వెయ్యి ఆటోమేటిక్ కుట్టుమిషన్లు పంపిణీ**

**రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది: మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద, నిరుద్యోగ బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గానికి 1000 మంది చొప్పున, వంద శాతం సబ్సిడీతో ఆటోమేటెడ్ కుట్టుమిషన్లు మిగతా 2లో..

## క్యూర్‌పరిధిలో ఇందిరమ్మ టవర్లకు శంకుస్థాపన

**భూములు పొరపాటున నిషేధిత జాబితాలో ఉంటే సవరిస్తాం**

- ఆ విషయంలో ఆందోళన అక్కర్లేదు
- పదేళ్లు అధికారంలో పాలించినవారు చేతబడులు చేయిస్తారా!
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- పేదల సొంతింటి కలను నెరవేరుస్తా
- కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన
- పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్(జనంసాక్షి):గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. పేదల రుణం తీర్చుకునేందుకు అవకాశం వచ్చిందని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నేతలపై రేవంత్ రెడ్డి పలు విమర్శలు గుప్పించారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారని మండిపడ్డారు.పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అండగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ. 12వేల కోట్లు మిగతా 2లో..



## చర్చలు లేవు.. ప్రజాసమస్యల ప్రస్తావన లేదు

**ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు**

**11 బిల్లులు ఆమోదం పొందాయని ప్రకటించుకున్న సర్కారు**

**వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా**

న్యూఢిల్లీ,ఆగస్టు13(జనంసాక్షి):పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే మిగతా 2లో..

## కాంగ్రెస్ ఉన్నంత కాలం దేశంలో లౌకికవర్గాలకు మనుగడ



- కొందరు మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు
- హిందూ, ముస్లింలను వేరుగా చూడను వారు నాకు రెండు కళ్ల వంటి వారు
- బంజారాహిల్స్‌లోని మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ అంటే సెక్యూలర్, కాంగ్రెస్‌కు హిందూ, ముస్లింలు రెండు కళ్లు లాంటి వారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు ఇచ్చాం. వెంటనే చాలామంది దీన్ని వ్యతిరేకిస్తూ మైనార్టీ రిజర్వేషన్లు అవసరం లేదని మాట్లాడారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసి తీసేయాలని ప్రయత్నాలు చేశారు. ఈ విషయంలో మోదీ, అమిత్ షా విఫలమయ్యారు. వారి పాలనలో మైనార్టీ రిజర్వేషన్లు తీసేస్తామని హామీ ఇచ్చారు. ధైర్యం ఉంటే తెలంగాణలో కాదు గుజరాత్‌లోని మైనార్టీ రిజర్వేషన్లు తీసేయండి మేం చూస్తామని చెప్పాం" - సీఎం రేవంత్ రెడ్డి

2లో..

## ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు

**అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు • మరోసారి పోచారం వ్యాఖ్యలు**



కామారెడ్డిప్రతినిధి,ఆగస్ట్13(జనంసాక్షి): అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌కి మద్దతు ఇచ్చాన ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి మిగతా 2లో..

## ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే

**మీతో కాకపోతే చెప్పండి మేమే ఆ పని చేస్తాం**

**పిల్లల ఆరోగ్యంతో ఆటలొద్దు • కేంద్రానికి సుప్రీం చురకలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్13(జనంసాక్షి): అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. మిగతా 2లో..



## మళ్లీ మొదటికొచ్చిన ఓటుకు నోటు కేసు

- ఫస్ట్ నుంచి వినాల్సిందే : సుప్రీం కోర్టు
- తుది విచారణ సమయంలోనే పదవీ విరమణ పొందిన జడ్జీలు
- 'పార్ట్‌హెడ్ మ్యాటర్'గా సీజేఐ ధర్మాసనం ముందు విచారణకు వచ్చిన పిటిషన్లు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికొచ్చింది. గతంలో ఈ కేసుపై విచారణ జరిపిన జడ్జీలు పదవీ విరమణ పొందటంతో కేసు మళ్లీ మొదటి నుంచి వినాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈరోజు 'పార్ట్‌హెడ్ మిగతా 2లో..

## భూముల అమ్మకాలు ఆపండి

- అవి వారసత్వ సంపద
- వేలం వెర్రిగా విక్రయిస్తున్నారు
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు లేఖ



హైదరాబాద్,ఆగస్ట్13(జనంసాక్షి): రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూము లు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభు త్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అ య్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూ నివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం. 83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి మిగతా 2లో..

## 'టెస్సరాక్ట్'కు భూకేటాయింపులపై రాజకీయాలు ఆపండి


**ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపాటు**



న్యూఢిల్లీ,ఆగస్ట్13(జనంసాక్షి): టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ. 30లక్షల నుంచి రూ. 80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. ఎకరా రూ. 1.50 కోట్లకు కేటాయించాం. 5 ఎకరాలు కావాలని టెస్సరాక్ట్ సంస్థ 2024లో దరఖాస్తు చేసుకుంది. ఏడాదిపాటు పరిశీలించి ఆ సంస్థకు 2025లో భూమిని కేటాయించాం. అందరికీ కేటాయించినట్టుగానే ఆ సంస్థకు కూడా ఎకరా రూ. 1.50 కోట్ల చొప్పున ఇచ్చాం. 2025 వరకు టెస్సరాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డి డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ కాదని ఎంపీ చామల వివరించారు. మిగతా 2లో..

## నూతన క్రీడా విధానంతో ముందుకెళ్తున్నాం

- విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాం
- అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడలు నిర్వహిస్తాం
- సీఎం రేవంత్ ఆహ్వాన లేఖను కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు అందించిన మంత్రి వాకిటి శ్రీహరి




న్యూఢిల్లీ,ఆగస్టు13(జనంసాక్షి):కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా మిగతా 2లో..

## పాక్‌వైపు కన్నెత్తిచూస్తే భారత్ నాశనమే..

- లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ ఉంది
- అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఆగస్ట్13(జనంసాక్షి): పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ మిగతా 2లో..



## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా హస్తం

**ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే మిగతా 2లో..

## చర్చలతో వివాదానికి ముగింపు పలకండి





**ఇది ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది**

**మాల్యా, ఎస్‌బీఐకు బాంబే హైకోర్టు సూచన**

న్యూఢిల్లీ(జనంసాక్షి):పరారీలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక స్వస్తి పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని ఓ ముగింపునకు తీసుకురావాలని తెలిపింది. ఈ వివాదాన్ని ఇలాగే కొనసాగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వినియోగించుకునేందుకు మిగతా 9లో..

### దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర

**ఇందుకోసం త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు : కిషన్ రెడ్డి**

2లో..

### ఈసీఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

**అప్రమత్తంగా ఉండాలి : సీఈవో**

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14.08.2026

# భూముల అమ్మకాలు ఆపండి

వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపా డాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

## నూతన క్రీడా విధానంతో ముందుకెళ్తున్నాం

క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా హస్తం

ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ఈసీఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

**అప్రమత్తంగా ఉండాలన్న సీఈవో**

హైదరాబాద్,ఆగస్ట్13(జనంసాక్షి):ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, అ÷ఎ, ం÷ఓ ఖఎౌలను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఇక్ష కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.







చెల్లించామని వివరించారు. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ లోన్లు అందించా మని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని గుర్తుచేశారు. 55 లక్షల కుటుంబా లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నా మన్న సీఎం, రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు 1000 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. శిల్పారామం వద్ద రూ.వెయ్యి కోట్లతో ఇందిరా మహిళాశక్తి స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని, ఓ వైపు వాటన్నింటినీ తీర్చుకుంటూనే మరోవైపు సంక్షేమం వైపు దృష్టి పెడుతున్నామని సీఎం తెలిపారు. "క్షుద్ర పూజల కోసం కొందరు కర్ణాటకకు పోయారు. రాష్ట్రం

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లకు శంకుస్థాపన

ఎండిపోవాలని కుట్ర చేశారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్ర పూజలు చేశాడు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడుతుంది. రాష్ట్ర బాగు కోసం నా సంకల్పం అందుకే వర్షాలు పడుతున్నాయి' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తానన్నారు. ఈ విషయంలో తనదీ పూచీ అని చెప్పారు. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారన్న సీఎం, సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని'అని సీఎం తెలిపారు.

# చర్చలు లేవు.. ప్రజాసమస్యల ప్రస్తావన లేదు

శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## మళ్లీ మొదటికొచ్చిన ఓటుకు నోటు కేసు

మ్యాటర్'గా సీజేఐ ధర్మాసనం ముందు ఓటుకు నోటు పిటిషన్లు విచారణకు వచ్చాయి. అయితే కేసు విచారణ జరుపుతున్న న్యాయమూర్తులు పదవీ విరమణ పొందడంతో కేసు విచారణ మళ్లీ మొదలు పెట్టాల్సిందేనని సీజేఐ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవహారానికి సంబంధించిన అంశాన్ని ఏసీబీతో విచారణ చేయించడంపై సుప్రీంకోర్టులో రేవంత్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య పిటిషన్లు దాఖలు చేశారు. ఇదే కేసులో బీఆర్ఎస్ నేతలు సైతం ఇంప్లీడ్ అయ్యారు. పార్ట్‌హెడ్ అని సీజేఐ ధర్మాసనం దృష్టికి బీఆర్?ఎస్ నేతల తరఫు న్యాయవాది తీసుకొచ్చారు. కొత్త కేసుగానే విచారణ చేపడతామని సీజేఐ తేల్చి చెప్పారు. ఇందుకు తగిన తేదీ, సమయం కేటాయించనున్నట్లు సీజేఐ ప్రకటించారు. తదుపరి విచారణను వాయిదా వేశారు.

## కాంగ్రెస్ ఉన్నంత కాలం దేశంలో లౌకికవర్గాలకు మనుగడ

హైదరాబాద్,ఆగస్ట్13(జనంసాక్షి): ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలం గాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## పాక్‌వైపు కన్నెత్తిచూస్తే భారత్ నాశనమే..

తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

## ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు

ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

# బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

పంపిణీ చేయనున్నట్లు సచివాలయం వేదికగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. మహిళా ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బలహీనవర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్న పొన్నం ప్రభాకర్,? సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్ అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. స్వయం ఉపాధి, టైలరింగ్, వ్యాపార అవకాశాలతో మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి 1,000 చొప్పున మిషన్లు కేటాయించామని మంత్రి తెలిపారు. తెలంగాణలో మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను బీసీ మహిళలకు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. బీసీ మహిళలకు నియోజకవర్గానికి 1000 ఆటోమేటిక్ కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నాం. బలహీనవర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్సం. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**ఆధునిక ఆటోమేటిక్ మిషన్లు :**

పాతకాలపు చేతి మిషన్ల కంటే వేగంగా, తక్కువ శ్రమతో ఎక్కువ దుస్తులు కుట్టడానికి వీలుగా ఉండే ఆటోమేటిక్ కుట్టు మిషన్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తోంది. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లు అందించడం ఈ పథకం ప్రత్యేకత. ఆధునిక కుట్టు మిషన్ల ద్వారా మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు.

# 10 నిమిషాల్లో చేరుకోకుంటే రూ.10వేల పెనాల్టీ

### హైవే అంబులెన్సులకు ఎన్‌హెచ్ఏఐ మార్గదర్శకాలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):జాతీయ రహదారులపై ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు అత్యవసరంగా స్పందించడంలో జాప్యాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ సంబంధిత నిబంధనలను మరింత కఠినతరం చేసింది. నేషనల్ హైవేలపై మోహరించే అంబులెన్సులు పది కిలో మీటర్ల పరిధిలోని ఏ ప్రమాద స్థలానికైనా పది నిమిషాల్లో చేరుకోవాలని నిర్దేశించింది. లేదంటే ఒక్కో ప్రమాదానికి రూ.10వేల జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అంబులెన్సులు టికెట్ స్వీకరించిన తర్వాత గంటలోపే ప్రమాద బాధితులను సమీపంలోని ఆసుపత్రులకు తీసుకెళ్లాలని పేర్కొంది. నిర్దేశించిన గడువులోగా చేర్చకున్నా రూ.10 వేల పెనాల్టీ ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది.ప్రమాద సంఘటనల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఎన్‌హెచ్ఏఐ కేర్ సిస్టమ్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా అంబులెన్సులు, క్రేన్లు, పెట్రోలింగ్ వాహనాలు సహా ఆన్-రోడ్ యూనిట్ల నిర్వహణకు కొత్త నిబంధనలు రూపొందించింది.నూతన మార్గదర్శకాల ప్రకారం.. సంఘటన జరిగిన ప్రదేశాన్ని బట్టి పది కి.మీ పరిధిలోని ప్రమాద స్థలికి చేరుకునేందుకు 10నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదు. అంతకన్నా ఎక్కువ దూరం ఉంటే అందుకు అనుగుణంగా కొంత ఎక్కువ సమయం తీసుకోవచ్చు. వాహనానికి ఉండే జీపీఎస్ ద్వారా అధికారులు దీనిని పర్యవేక్షిస్తారు.ఏదైనా అత్యవసర టికెట్‌ను అంబులెన్సు తిరస్కరించినా రూ.10 వేల జరిమానా పడుతుంది. కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం అన్ని పరికరాలు, ఔషధాలు, సిబ్బంది ఉండాలి. లేదంటే జరిమానా తప్పదు.ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ప్రస్తుతం 50వేల కి.మీ మేర జాతీయ రహదారులున్నాయి. వీటిపై 3000 అంబులెన్సులు, 1000 పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఏఐఎస్-400 కంప్లైంట్ జీపీఎస్ పరికరాలు ఉండడంతోపాటు ఒక్కో వాహనం లో ఐఓటీ సిమ్‌తో కూడిన ఆండ్రాయిడ్ మొబైల్ కూడా ఉంటుంది.జాతీయ రహదారుల్లో హెల్ప్‌లైన్ కోసం 1033 నంబర్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ప్రమాదాల వేళ అత్యవసర స్పందనలో జాప్యాన్ని తగ్గించాలని రోడ్డు భద్రతపై సుప్రీం కోర్టు నియమించిన కమిటీతోపాటు కాగ్ ఆడిట్ నివేదికలు సూచించిన విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ గుర్తుచేసింది.ఈ నేపథ్యంలో ఈ నూతన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని అందరు ప్రాజెక్టు డైరెక్టర్లు, రీజినల్ ఆఫీసర్లకు ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది. అలసత్వం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

## రష్యా కీలక రిఫైనరీపై ఉక్రెయిన్ దాడి

**ఆ దేశం భూభాగంలోని**

**1300 కి.మీ చొచ్చుకెళ్లి మళీ బాంబుల వర్షం**

**మాస్కో(జనంసాక్షి):**రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య పరస్పర దాడులు తీవ్రతరమయ్యాయి. ఈ క్రమంలోనే రష్యాలోకి చొచ్చుకెళ్లిన ఉక్రెయిన్ డ్రోన్లు.. సరిహద్దుకు దాదాపు 1,300 కి.మీల దూరంలో ఉన్న ఓ కీలక రిఫైనరీపై దాడులు చేశాయి. మాస్కో చమురు పరిశ్రమను దెబ్బతీయడమే లక్ష్యంగా.. మూడు రోజుల్లో చేపట్టిన నాలుగో దాడి ఇది. మరోవైపు.. క్రిమియాలోని సెవస్తోపోల్‌లో పేలుడు పదార్థం పేలి రష్యాకు చెందిన నలుగురు నిపుణులు, ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందారు."రష్యాలోని బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లో ఉన్న గ్యాజ్‌ప్రోమ్ నెఫ్తెఖిమ్ సలావత్ చమురు శుద్ధి, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై డ్రోన్లతో దాడులు చేశాం. ఫలితంగా ఆ ప్రాంగణంలో మంటలు చెలరేగాయి. ఉక్రెయిన్ సరిహద్దుకు దాదాపు 1,300 కి.మీ. దూరంలో ఉన్న ఈ కాంప్లెక్స్.. రష్యాలోని అతిపెద్ద రిఫైనరీల్లో ఒకటి. ఏటా దాదాపు 7.4 కోట్ల బ్యారెళ్ల చమురును శుద్ధి చేస్తోంది" అని ఉక్రెయిన్ సైన్యం పేర్కొంది. ఇదే ప్రాంతంలోని తమ గోదాంలోనూ మంటలు చెలరేగాయని రష్యాలోని అతిపెద్ద ఆన్‌లైన్ రిటైలర్ వైల్డ్‌బెరీస్ ప్రకటించింది. అయితే, అక్కడ సరకులేమీ నిల్వ లేవని పేర్కొంది.రష్యా సైతం ఉక్రెయిన్‌పై బాలిస్టిక్ క్షిపణులు, జెట్ డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో విరుచుకుపడుతోంది. బుధవారం నుంచి గురువారం రాత్రి వరకు ఉక్రెయిన్ వ్యాప్తంగా 133 డ్రోన్లతో జరిపిన దాడుల్లో నలుగురు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. దక్షిణ ఒడెసాలో ఓ ప్రయాణికుల రైలుపై జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు మృతి చెందారని రైల్వే అధికారులు తెలిపారు.రష్యా క్షిపణులను తిప్పికొట్టేందుకు.. అమెరికా తయారు చేస్తున్న పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమకు ప్రస్తుతం అత్యంత అవసరమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పేర్కొన్నారు. 2025తో పోలిస్తే ఈ ఏడాది తమ వద్ద రెండున్నర రెట్లు తక్కువ పేట్రియాట్‌లు ఉన్నాయని చెప్పారు.

## ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే

గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.



# యూరియా కోసం సొసైటీకి తాళం..

- కొత్తపల్లిలో యూరియా కోసం రైతుల ఆందోళన..

**గంభీరావుపేట ఆగస్టు 13 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. సాయంత్రం మూడు గంటలకు యూరియా యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని రైతులకు వ్యవసాయ సొసైటీ నుండి మెసేజ్ గ్రూపులో తెలియజేశారు కానీ, మూడు గంటల నుండి ఎంత చూసినా యూరియా బుక్కు కాలేదని యూరియా కోసం సొసైటీ వద్దకు వచ్చిన రైతులకు సరైన సరఫరా అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి ఎదురు చూస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి, యూరియా యాప్ ను తీసేయాలని, యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చి రైతుల సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## శశికిరణ్ కొమాండూర్ 'శ్రీమద్రామాయణం'కు
# తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారం



**హైదరాబాద్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీ, సీనియర్ గ్రూప్-1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం 'శ్రీమద్రామాయణం' 2024 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. పరిపాలనా విధులు నిర్వహిస్తూనే రెండు దశాబ్దాలుగా సాహిత్య సాధన కొనసాగిస్తున్న శశికిరణ్.. సామాన్య పాఠకుడికీ సులభంగా అర్థమయ్యే వాడుకభాషలో, ఛందోబద్ధంగా 'శ్రీమద్రామాయణం'ను రచించారు. ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో ఈ మహాకావ్యాన్ని ప్రచురించింది. సాహితీవేత్తగానే కాకుండా, వ్యక్తిగత జీవితంలో అత్యున్నత నైతిక విలువలు, నిజాయితీ కలిగిన అధికారిగా శశికిరణ్ గారికి గొప్ప పేరుంది. గతంలో భారత ప్రభుత్వ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి పరిశీలించినప్పటికీ ఆయన దానిని సున్నితంగా తిరస్కరించారు. ఆ సమయంలో ఆయన సంబంధిత కేంద్ర మంత్రి వద్ద విధులు నిర్వర్తిస్తుండటంతో.. ఏ చిన్న విమర్శకు తావివ్వకూడదన్న ఉద్దేశ్యంతో, పదవిలో ఉన్నప్పుడు తన శాఖ నుంచి అవార్డు తీసుకోవడం నైతికం కాదని ఆ అవకాశాన్ని వదులుకున్నారు. నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ తనదైన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న శశికిరణ్‌కు ఈ పురస్కారం లభించడం పట్ల కవులు, రచయితలు, ఉన్నతాధి కారులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**శశికిరణ్ కొమాండూర్ కు గ్రూప్ -1 అధికారుల సంఘం అధ్యక్షులు , లోక్ భవన్ అధికారుల సత్కారం**

తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన శశికిరణ్ కొమాండూర్ ను గ్రూప్ -1 అధికారుల సంఘం అధ్యక్షులు మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ , గవర్నర్ ఉప కార్యదర్శి జి పల్లవి,ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, సమన్వయ అధికారి మరళీ చార్యులు, అకౌంట్ ఆఫీసర్ శైలజ , అసిస్టెంట్ కంప్ట్రోలర్ జెడ్ హెరాల్డ్ డేవిడ్,ఉద్యానవన అధికారిణి మాలిని, డిఈఈ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ ఎస్ రామచంద్రం, సాంఖ్యక అధికారి శ్రీకాంత్ ఏఈఈలు హర్ష వర్ధన్, త్రిష లులోక్ భవన్ లో సత్కరించారు. లోక్ భవన్ ఉద్యోగులు సిబ్బంది ప్రత్యేకంగా శశికిరణ్ కొమాండూర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజల అసంతృప్తి

- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తిరిగి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, అందుకోసం ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన 432 హామీలను నెరవేర్చక పోవడం, అభివృద్ధి కుంటుపడి పోవడం, సంక్షేమ పథకాల అమలు నిలిచిపోవడంతో రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు, దివ్యాంగులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన సందర్భంగా ఎంపీ రవిచంద్ర ఢిల్లీలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశాలలో ప్రభుత్వం తీసుకువచ్చిన 10 బిల్లులపై బీఆర్ఎస్ స్పష్టంగా మాట్లాడడం జరిగిందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించామని, తెలంగాణ ప్రజలు ఆకాంక్షలు, న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందు పెట్టామన్నారు. నిధులు, నీళ్లు, నియమకాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన కేసీఆర్ ఆ దిశగా ముందుకు సాగి అన్ని విధాలా అభివృద్ధి చేశారని ఆయన కొనియాడారు.

# అప్పు తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల కేసు

**హైదరాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మానికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# ప్రజలకు జవాబుదారులు అధికారులు

- రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి
- మండల నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం
- పాల్గొన్న చిన్నారెడ్డి, విద్యాసాగర్, వేముల శ్రీనివాసులు, దివ్య దేవరాజన్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల ( 560 మంది ) శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవో లకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75 శాతం సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు. స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రజలు మాస్టర్స్ అని, అధికారులు సేవకులు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రజావాణి బాధ్యులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అధికారులు పబ్లిక్ సర్వేంట్స్ అన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించవద్దని అన్నారు. మండల, జిల్లా నోడల్ అదుకారులు ఆఫీస్ లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడం కర్తవ్యంగా భావించాలని విద్యాసాగర్ సూచిం చారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రజావాణి వ్యవహారాల పర్యవేక్షకులు, సీఎం ఓ.ఎస్.డీ. వేముల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నో సమస్యలతో ప్రజావాణికి వచ్చే ప్రజలకు సాంత్వన కల్పించాలని రాష్ట్రంలోని ఎంపీడీవో లకు సూచిం చారు. మండల నోడల్ అధికారి, మిగతా శాఖల అధికారులు ప్రజల విశ్వాసాన్ని చురగొనాలని వేముల శ్రీనివాసులు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా వింటే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని, సమస్యల పరిష్కారం కోసం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండ ల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు తీసుకోవాల్సిన అనేక అంశా లను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా నిపుణులు వివరిం చారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, సీఎం ప్రజావాణి ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారి సుశీల, సీఎం ప్రజావాణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల గుండెల్లో కలెక్టర్ 'రాజర్షిషా'

- ఊరికే ఆయన పేరిట నామకరణం!




**మావల ఆగస్ట్ 14 ( జనం సాక్షి):** అదో గిరిజన గూడెం కనీస సౌకర్యాలు లేనటువంటి దుర్భర పరిస్థితులలో జీవనం సాగిస్తున్న ఆదివాసి కుటుంబాలు.పట్టిపీడిస్తున్న పేదరికం.. సరైన నివాసం లేక ఇబ్బందులు పడుతున్న మారుమూల కొలాం గిరిజనుల జీవితాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా సరికొత్త వెలుగులు నింపారు. నిరుపేదలకు ఇళ్ల పట్టాలతో పాటు 'ఇందిరమ్మ గృహాలు' మంజూరు చేసి, వారి సొంతింటి కలను నిజం చేయడంలో చూపిన ప్రత్యేక చొరవకు గిరిజనులు నీరాజనాలు పట్టారు. తమ బతుకుల్లో మార్పు తెచ్చిన అధికారిపై ప్రత్యేక అభిమానంతో, దహిగూడ కొలాం గూడేనికి 'రాజర్షిషాగూడ' అని నామకరణం చేసుకుని తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

గురువారం పిప్పలధరి పంచాయతీ పరిధిలోని దహిగూడ (రాజర్షిగూడ)లో పర్యటించిన జిల్లా కలెక్టర్, గ్రామంలో నిర్మాణం పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశం చేసి ప్రారంభించారు. గతంలో 17 మంది పేద గిరిజనులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఆయన చొరవతో మౌలిక వసతులు వేగవంతమయ్యాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ గిరిజనులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇస్తూ.. పిప్పలధరి పంచాయతీ పరిధిలో మరో 10 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గిరిజన కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు మేకలు, పాడి పశువుల (బర్రెల) యూనిట్ల మంజూరుతో పాటు మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ, డిగ్రీ చదివిన స్థానిక యువతకు ఆదిలాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

గ్రామంలో ప్రధాన సమస్యలైన కరెంట్, సెల్ నెట్‌వర్క్, రవాణా సౌకర్యాలపై కలెక్టర్ వెంటనే స్పందించారు. తరచూ విద్యుత్ నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈని ఆదేశించగా, సెల్ టవర్ నిర్మాణం కోసం స్థలం కేటాయించి నెట్‌వర్క్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆధార్ కార్డులు లేని వారికి వెంటనే కొత్త ఆధార్ల నమోదు పూర్తి చేయాలని ఇడిఎం, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే మారుమూల మామిడికోరి గ్రామానికి రోడ్డు (జన వర్క్) సౌకర్యం, జలసిరి కింద రైతులకు ఫార్మ్ పాండ్స్, అర్హులకు చేయూత పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, పిడి హౌసింగ్ పీడీ శంకర్, స్థానిక తహశీల్దార్ గోవింద్, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు , గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ మహిళలకు స్వయం ఉపాధి

- ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్ట్ 13 (జనంసాక్షి) :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## లోకాయుక్తాకు ఫిర్యాదు పేరుతో
# రాజకీయ డ్రామా వద్దు

- ఆరోపణలు నిరూపిస్తే చర్యలకు సిద్ధం : మంత్రి వాకిటి శ్రీహరి
- పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు మంత్రి వాకిటి కౌంటర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో అక్రమాలు జరుగుతున్నాయంటూ మాజీ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను మంత్రి వాకిటి శ్రీహరి తీవ్రంగా ఖండించారు. ఆధారాలు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేయడం సరికాదని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేందుకు రాజకీయ దుష్ప్రచారం చేయొద్దని ఆయన స్పష్టం చేశారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో నకిలీ పాసుపుస్తకాలు, బోగస్ పట్టాలు సృష్టించి అక్రమంగా పరిహారం చెల్లిస్తున్నారని ఆరోపిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు అందుకు సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారమే భూసేకరణ, పరిహారం ప్రక్రియను నిర్వహిస్తోందన్నారు. లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన విషయాన్ని రాజకీయ ప్రచారంగా కాకుండా చట్టపరమైన ప్రక్రియగా ఎదుర్కొంటామని అన్నారు. నిర్వాసితుల జాబితాలో మార్పులు జరిగాయని ఆరోపణలు చేస్తున్న వారు ఆ మార్పులకు సంబంధించిన అధికారిక రికార్డులను ప్రజల ముందు ఉంచాలని కోరారు.

**కమీషన్ల ఆరోపణలు నిరాధారం**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థలు, కాంగ్రెస్ నాయకులపై కమిషన్ల ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని వాకిటి శ్రీహరి అన్నారు. అవినీతి జరిగిందని చెబుతున్న వారు ఒక్కో ఆరోపణకు ఆధారాలు చూపాలని, నిరూపిస్తే విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణలో అర్హులైన రైతులకు న్యాయం చేయడం, ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.

## కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లో విషాదం

- లిఫ్ట్‌లో ఇరుక్కుని ఇద్దరు టెక్నీషియన్ల మృతి

**వరంగల్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట శివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. గణెళిశా ఎకోపెట్ క్లాత్ ఫ్యాక్టరీలో లిఫ్ట్‌లో ఇరుక్కుని ఇద్దరు సిబ్బంది మృతిచెందారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్యప్రకాశ్ (31)గా మృతులను గుర్తించారు. అయితే, వారిద్దరూ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల పూర్తి కారణాలపై ఆరా తీస్తున్నారు. లిఫ్ట్‌లో ప్రమాదం ఎలా జరిగింది? నిజంగానే షార్ట్‌సర్క్యూట్ జరిగిందా? వంటి అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# జగన్ హయాంలో నీటి దోపిడీని పట్టించుకోని కెసిఆర్

- ఆనాడు బిఆర్ఎస్ నేతలు ఎందుకు ప్రశ్నించలేదు
- తెలంగాణ ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి




**హైదరాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అదనపు నీటిని ఏపీ తరలిస్తుంటే బీఆర్ఎస్ నేతలు అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని తెలంగాణ ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. స్వలాభం కోసం, ఎంపీ సీట్ల కోసం తెలంగాణ నీటిని, ప్రజలను ఏపీకి కేసీఆర్ తాకట్టు పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వతంగా తెలంగాణకు కేసీఆర్ నష్టం చేశారని ఆగ్రహించారు. గురువారం సీఎల్పీ మీడియా పాయింట్‌లో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ఢిల్లీలో గద్దె ఎక్కడానికి చేసిన ప్రయత్నాలు అన్ని ఇన్ని కావని ప్రస్తావించారు. కేసీఆర్ రాయలసీమను రతనాల సీమ చేస్తాననే విషయాన్ని బీఆర్ఎస్ నేత జగదీశ్వర్ రెడ్డి మర్చిపోయినట్లుగా ఉన్నారని విమర్శించారు. జగదీశ్వర్ రెడ్డి రాజకీయాల కోసం రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసిన, ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి రోజుకో కొత్త డ్రామాకు తెరదీస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఏపీకి అదనంగా తరలించుకొని పోయిన నీటి గురించి వైసీపీ నేతలే ప్రెస్‌మీట్లు పెట్టి మరి చెబుతున్నారని అన్నారు. గతంలో జగన్ రెడ్డి సీఎం హోదాలో అసెంబ్లీ వేదికగా శ్రీశైలం నుంచి తీసుకెళ్తున్న నీటిని ప్రస్తవించలేదా..? అని నిలదీశారు. కేసీఆర్ సహకారంతో ప్రాజెక్టులను పెంచుతున్నట్లు జగన్ అసెంబ్లీలో చెప్పారని అన్నారు. జగన్ అసెంబ్లీలో మాట్లాడినప్పుడు జగదీశ్ రెడ్డి ఎక్కడ ఉన్నారని శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. ఎల్‌నినో ఎఫెక్ట్ ఉన్నా దేవుడి దయ వల్ల వర్షాలు పడుతున్నాయని చెప్పుకొచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ నేతలు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. కృష్ణాలో 500 టీఎంసీల నీటి కోసం కాంగ్రెస్ కోట్లాడుతోందని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బేసిన్‌లు లేవు, బేషజాలు లేవని చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు చేసే విమర్శలకు తాము అసెంబ్లీలో చర్చిస్తామని.. కేసీఆర్ సభకు రావాలని యెన్నెం శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు.

సంపాదకీయం

# ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి ఇదేనా సమాధానం?

ప్రశ్నోత్తరాల సమయం రద్దు కావడం.. ప్రజా ప్రాధాన్యత గల అంశాలపై చర్చ జరగకుండానే బిల్లులు ఆమోదం పొందడం.. చివరకు సభ నిరవధికంగా వాయిదా పడటం.. ఇవి కేవలం పార్లమెంటరీ కార్యకలాపాల్లో ఏర్పడిన అంతరాయాలు కావు. ఇవి భారత ప్రజాస్వామ్య వ్యవస్థను లోపల నుంచి ప్రశ్నిస్తున్న పరిణామాలు. పార్లమెంటు అంటే మెజారిటీ ఉన్న పార్టీ తనకు నచ్చిన చట్టాలను ఆమోదించుకునే వేదిక కాదు. ప్రజల తరపున ప్రశ్నించే వేదిక. ప్రభుత్వాన్ని నిలదీసే వేదిక. అధికారాన్ని జవాబుదారీగా ఉంచే రాజ్యాంగబద్ధ వ్యవస్థ.

ఆ వ్యవస్థకు అత్యంత కీలకమైన ఆయుధం ప్రశ్నోత్తరాల సమయం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతినిధులు ప్రశ్నిస్తారు. మంత్రులు సమాధానాలు చెబుతారు. ఆ సమాధానాల ద్వారా ప్రభుత్వ పనితీరు ప్రజల ముందుకు వస్తుంది. ప్రశ్నకు సమాధానం చెప్పడం అంటే ప్రతిపక్షానికి ఉపకారం చేయడం కాదు.. ప్రజలకు జవాబు చెప్పడం. అలాంటి ప్రశ్నోత్తరాల సమయం స్తంభిస్తే, మూగబోయేది ప్రతిపక్షం కాదు.. ప్రజల గొంతే.

ఇంకా తీవ్రమైన విషయం.. చర్చ లేకుండానే బిల్లులు ఆమోదం పొందడం. చట్టం ఒకసారి ఆమోదం పొందితే అది కోట్లాది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుంది. అలాంటి చట్టాలపై సభ్యులు మాట్లాడకూడదా? లోపాలను ఎత్తిచూపకూడదా? ప్రత్యామ్నాయ సూచనలు చేయకూడదా? ప్రభుత్వం తన ప్రతిపాదనను సమర్థించుకోకూడదా? ఇవన్నీ జరగకుండానే సంఖ్యాబలం ఆధారంగా చట్టాలు ఆమోదమైతే.. పార్లమెంటు చర్చా వేదికగా మిగులుతుందా? లేక కేవలం ఓటింగ్ యంత్రంగా మారుతుందా?

జనంసాక్షి

సభలో అంతరాయాలు రావడం కొత్త కాదు. అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య విభేదాలు ఉండటం కూడా ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ అంతరాయాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఇరుపక్షాలదే. సభను నడపాల్సిన బాధ్యత అధికార పక్షంపై మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతిపక్షం ప్రశ్నిస్తే వినాలి. ప్రతిపక్షం ఆందోళన చేస్తే చర్చకు మార్గం వెతకాలి. చర్చకు అవకాశం లేకపోతే అసంతృప్తి మరింత పెరుగుతుంది. అదే అసంతృప్తి సభ వెలుపల ప్రజా ఆందోళనలకు దారితీస్తుంది.

> ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు మాత్రమే కాదు.. బాధ్యత. జవాబు చెప్పడం ప్రభుత్వ దయ కాదు.. కర్తవ్యం. ఈ రెండింటి మధ్య సంభాషణే పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఆ సంభాషణ తెగిపోయిన రోజున ప్రజాస్వామ్యం గెలిచిందని చెప్పలేం. ప్రజా సమస్యలపై చర్చలు లేకుండానే ముగిసిన ఈ పార్లమెంటరీ సమావేశాలు.. ఒక సమావేశం ముగిసిన ఘటనగా మాత్రమే మిగలకూడదు.

ప్రతిపక్షాన్ని కేవలం 'అడ్డంకి'గా చూడటం కూడా ప్రమాదకరమైన రాజకీయ దృష్టికోణమే. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో అధికార పక్షం ఏర్పడినట్లే, అదే ప్రజల ఓట్లతో ప్రతిపక్షం కూడా ఏర్పడుతుంది. అధికారానికి మెజారిటీ ఇచ్చిన ప్రజలు.. అధికారాన్ని ప్రశ్నించే హక్కును ప్రతిపక్షానికి కూడా ఇచ్చారు. అందుకే ప్రతిపక్షం బలంగా ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి సమస్య కాదు. ప్రశ్నలు లేకపోవడమే అసలు సమస్య.

ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి కేబినెట్ ర్యాంక్ హోదా ఇవ్వడం వెనుక ఉన్న భావం కూడా ఇదే. అధికారానికి ప్రత్యామ్నాయ స్వరం పార్లమెంటులో ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించే కళ్లుండాలి. తప్పులను ఎత్తిచూపే గొంతుండాలి. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా కనిపించే నిర్ణయాలపై ప్రశ్నించే వ్యవస్థ ఉండాలి. ఆ స్వరాన్ని రాజకీయ అసౌకర్యంగా భావించి పక్కన పెట్టడం పార్లమెంటరీ సంప్రదాయాల స్ఫూర్తికి విరుద్ధం.

యువత సమస్యల విషయంలో ఈ బాధ్యత మరింత పెరుగుతుంది. పరీక్షా పత్రాల లీకేజీలు.. ఉద్యోగాల కొరత.. నిరుద్యోగం.. విద్యార్థుల భవిష్యత్తుపై అనిశ్చితి.. ఇవి రాజకీయ నినాదాలు కావు. కోట్లాది కుటుంబాల జీవితాలను ప్రభావితం చేసే ప్రశ్నలు. విద్యార్థులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే వారి స్వరాన్ని పార్లమెంటులో వినిపించాలి. ఆందోళనలపై ఆరోపణలు వస్తే అధికారిక దర్యాప్తు జరగాలి. ఎవరు తప్పు చేశారో ఆధారాలతో తేలాలి. కానీ ఆరోపణలను విచారణకు ముందే తీర్పులుగా మార్చడం ఎంత తప్పో.. ప్రశ్నించే హక్కునే నిరాకరించడం కూడా అంతే తప్పు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనకు స్థానం లేకపోతే అసంతృప్తికి మార్గం ఎక్కడ ఉంటుంది? పార్లమెంటులో చర్చకు స్థానం లేకపోతే ప్రజల సమస్యలకు పరిష్కారం ఎక్కడ దొరుకుతుంది? ప్రశ్నలకు సమాధానాలు లేకపోతే ప్రభుత్వ జవాబుదారీతనం ఎలా నిర్ధారించబడుతుంది?

గతంలో దేశం యుద్ధాలను చూసింది. అత్యవసర పరిస్థితులను చూసింది. మహమ్మారి వంటి అసాధారణ పరిస్థితులను చూసింది. ఆ సందర్భాల్లో పార్లమెంటరీ కార్యకలాపాలపై వచ్చిన పరిమితులు కూడా చర్చకు, విమర్శకు గురయ్యాయి. కానీ సాధారణ రాజకీయ పరిస్థితుల్లోనే ప్రశ్నోత్తరాలు స్తంభించడం, చర్చలు కుదించుకుపోవడం, బిల్లులు వేగంగా ఆమోదం పొందడం ఒక అలవాటుగా మారితే.. అది కేవలం సభ ఉత్పాదకత తగ్గడం కాదు. అది ప్రజాస్వామ్య సంస్కృతి క్షీణిస్తున్న సంకేతం. **ఒకప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సభా కార్యక్రమాలను సర్దుబాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. అధికార పక్షం సంఖ్యాబలం ఉన్నప్పటికీ ప్రతిపక్షానికి గౌరవం ఇచ్చిన సంప్రదాయాలు ఉన్నాయి. అది బలహీనత కాదు. అదే ప్రజాస్వామ్య పరిపక్వత. మెజారిటీ అంటే మిగిలిన స్వరాలను మూయించే అధికారం కాదు. మెజారిటీ అంటే మరింత బాధ్యత.**

ప్రభుత్వానికి మెజారిటీ ఉండొచ్చు. చట్టాలు ఆమోదించే సంఖ్యాబలం ఉండొచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం కంటే ముఖ్యమైనది జవాబుదారీతనం. ప్రతిపక్షం ప్రశ్నిస్తే సమాధానం చెప్పగల ధైర్యం ప్రభుత్వానికి ఉండాలి. తన నిర్ణయాన్ని చర్చకు పెట్టగల నమ్మకం ఉండాలి. విమర్శను భరించగల ప్రజాస్వామ్య సంస్కారం ఉండాలి.

అదే సమయంలో ప్రతిపక్షానికీ బాధ్యత ఉంది. సభను స్తంభింపజేయడం శాశ్వత వ్యూహం కాకూడదు. నిరసనకు కూడా ఒక పరిమితి ఉండాలి. ప్రజా సమస్యలపై చర్చ జరగాలనే డిమాండ్ చేస్తూ.. అదే చర్చకు అవకాశం లేకుండా చేయడం ప్రజలకు కూడా సమాధానం చెప్పాల్సిన పరిస్థితినే తెస్తుంది. అందుకే అధికార పక్షం జవాబుదారీతనంతో పాటు ప్రతిపక్షం కూడా నిర్మాణాత్మక బాధ్యతను నిర్వర్తించాలి. పార్లమెంటు మూగబడిన ప్రతిసారీ ప్రజాస్వామ్యం కొంచెం బలహీనపడుతుంది. ప్రశ్నకు సమాధానం రాకపోయిన ప్రతిసారీ ప్రభుత్వ జవాబుదారీతనం కొంచెం తగ్గుతుంది. చర్చ లేకుండా చట్టం ఆమోదమైన ప్రతిసారీ ప్రజల భాగస్వామ్యం కొంచెం క్షీణిస్తుంది.

పార్లమెంటు కేవలం చట్టాలు చేసే కర్మాగారం కాదు. అది ప్రజల ఆశలు, ఆందోళనలు, ప్రశ్నలు, అసమ్మతులు ప్రతిధ్వనించే అత్యున్నత ప్రజా వేదిక. ఆ వేదికలో ప్రశ్నలు లేకపోతే.. సమాధానాలు లేకపోతే.. చర్చలు లేకపోతే.. మిగిలేది కేవలం సంఖ్యల రాజకీయమే. ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు మాత్రమే కాదు.. బాధ్యత. జవాబు చెప్పడం ప్రభుత్వ దయ కాదు.. కర్తవ్యం. ఈ రెండింటి మధ్య సంభాషణే పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఆ సంభాషణ తెగిపోయిన రోజున ప్రజాస్వామ్యం గెలిచిందని చెప్పలేం. ప్రజా సమస్యలపై చర్చలు లేకుండానే ముగిసిన ఈ పార్లమెంటరీ సమావేశాలు.. ఒక సమావేశం ముగిసిన ఘటనగా మాత్రమే మిగలకూడదు. ప్రజాస్వామ్య వ్యవస్థ తనను తాను ప్రశ్నించుకోవాల్సిన హెచ్చరికగా మిగలాలి.

# ప్రపంచీకరణలో కాక్రోచ్



జనంసాక్షి

సోషల్ మీడియాతో బిజీ అయిపోయిన యువతకు ఆర్థిక, సామాజిక విషయాలతో సంబంధం లేదని పాలకవర్గం ధీమాగా ఉన్న తరుణంలో అకస్మాత్తుగా ఊడిపడిన కాక్రోచ్ సునామీ జంతర్ మంతర్‌లో ప్రకంపనాలు సృష్టించింది. ప్రజల్ని నిష్క్రియాత్మక పౌరులుగా ఇన్నాళ్లుగా మార్చేస్తున్న పరిస్థితులు 2014 నుండి మనకు కనిపిస్తున్నాయి. ప్రజా ప్రభుత్వాల ద్వారా వచ్చిన మంత్రివర్గం రాజులనీ, వారిని ప్రశ్నించడం నేరమనీ, వారు దైవాంశ సంభూతులనీ అభివర్ణించే పాలక వర్గానికి అనుకూలంగా ఉన్న భావజాలం పౌరులు జీర్ణించుకుంటున్నారు. దూదూ బసవన్న ల్లాగా కొన్ని టీవీ ఛానెల్స్ యాంకర్స్ కూడా అదే పిచ్ లో బాధ్యతాయుతమైన తమ జర్నలిస్టు నైతికతను తుంగలో తొక్కి రాజుల్ని కీర్తించే భక్తులుగా మారిపోయారు. ఈ రకమైన ఛానళ్ల మాయాజాలంలో పడిన ఒక పెద్ద సమూహం, యువత ప్రశ్నించడం అనే అతి ముఖ్యమైన బాధ్యతనుండి పక్కకు తొలగింది. అసలు ప్రశ్న వేయడమే ఒక అవాంఛనీయమైన చర్య అంటూ కొత్త తర్కాలు వినవచ్చాయి. అమర్త్యసేన్ ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్ పీసీ సర్కార్ మేజిక్ లా మాయమైపోయింది.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం అన్నది ఓట్లు వేసినంత సాధారణమైన విషయం. ఇది ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రశ్నలు వేయడం, హింసాత్మక చర్యలు లేకుండా నిరసన ప్రదర్శించడం పరిపాలనలోని అవకతవకల్ని విమర్శించడం, చర్చించడం, సమీక్ష చేయడం అంతా కూడా ప్రజాస్వామ్యంలో అంతర్భాగమే. బదులుగా మంత్రుల్ని దేవుళ్ళు లా కొలిచే ఒక పెద్ద మధ్య తరగతి వర్గం కూడా అదే దారిలో పయనించింది. ఇలాంటి ప్రశ్నించని తరం ఇలానే కొనసాగుతుందని పాలకవర్గం అత్యంత ధీమాగా ఉన్న తరుణంలో ఎటునుంచో వచ్చిన ఒక కాక్రోచ్ సునామీ ఊహించని విధంగా పాలకవర్గాన్ని ఒక ఊపు ఊపింది. ప్రతిపక్ష పార్టీలు నిరసన ప్రదర్శించడం, ప్రశ్నించడం, పార్లమెంటులో కూడా ప్రశ్నించడం పార్లమెంటరీ విధానం అలవర్చుకున్న పద్ధతిలో ఒక అంతర్భాగం. దానికి పాలకవర్గాలు కూడా సిద్ధంగానే ఉంటాయి. కానీ, ఊహించని మలుపు తిరిగిన బొద్దింకల సునామీ అన్నది ఇటు ప్రజలు గానీ, ప్రభుత్వం గానీ ఊహించలేదు.

నీట్ పరీక్ష మీద కొన్ని లక్షల మంది యువత ఆశలు పెట్టుకొని ఉంటారు. లాభాలూ, మార్కెటీకరణకు అతీతంగా క్యూబాలాంటి చిన్న దేశం అత్యంత ప్రతిభావంతంగా వైద్యులను సృష్టించి రుజువు చేసింది. ఎన్నో దేశాలు క్యూబా వైద్యుల సహకారం అందుకున్నాయి. అందుకుంటు న్నాయి. ఒక చిన్న క్యూబా దేశం అత్యంత ప్రతిభా వంతంగా వైద్యుల్ని తయారు చేసి ప్రపంచానికి పంపిస్తుంటే మనం ఇంకా ఒక పరీక్షను కూడా నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నాం. గత ఐదు దశాబ్దాలలో క్యూబా దేశం మూడు లక్షల 25 వేల మంది ఆరోగ్య సేవకులను ప్రపంచంలోని 158 దేశాలకు పంపించింది. అక్కడ వైద్యం సేవగా ఉంటే, ఇక్కడ వైద్యం బడా కార్పొరేట్ లో చేతుల్లోకి పయనిస్తూ పేదవాడిని మరింత పేదరికంలోకి ముంచేసే వ్యాపార సరుకుగా మారిపోయింది. రోగులు ఇప్పుడు హాస్పిటల్స్ లోనికి వెళ్లాలంటే భయంతో ఉండే పరిస్థితి ఉంది. ఒకవైపు ఇలా ఉంటే మరోవైపు ఇన్సూరెన్స్ కంపెనీలు విపరీతమైన ప్రీమియంలు తీసుకొని అవసర సమయాల్లో ఏ క్లాస్ చూపించి రిజెక్ట్ చేద్దామా అని దిశలో ఉన్నారు. నియంత్రణ అన్నది అంతంత మాత్రంగానే ఉంది ఫలితంగా నలిగిపోయేది పేదవాడు, మధ్యతరగతి మాత్రమే.

కానీ, మన యువత ఇంకా లీకేజీ పేపర్లతోనే సమిధ లవుతూ ఉంది. కోచింగ్ సెంటర్లలో లక్షల కొలది డబ్బుని ధారపోసిన తర్వాత మిడ్ నైట్ ఆయిల్ ఆరే వరకూ చదివిన తరం లీక్ అయిన పేపర్లను చూసి భరించలేకపోతోంది? బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న పెద్దలు యువతకు బొద్దింకలని అంటే భరించలేని స్థితిలో ఉన్నారు. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణలు ఉద్యోగాలను ఎలానూ పెంచలేదు. కనీసం ఒక పరీక్ష కూడా సక్రమంగా నిర్వర్తించలేకపోవడం అత్యంత బాధాకరమైన విషయం. ఇలాంటి విషమ పరిస్థితుల్లో అకస్మాత్తుగా ఊడిపడిన కాక్రోచ్ జనతా పార్టీ ఏదో ఒక సాధారణమైన పార్టీ మాత్రమే కాదు. ప్రభుత్వానికి సవాల్ చేస్తూ నిలబడిన కొత్త యువతరం. ఈ తరం ఇంటర్నెట్, సోషల్ మీడియా మాయాజాలంలో కొట్టుకుపోయి సామాజిక సమస్యలు పట్టించుకునే తీరికలేని తరం అని ధీమాగా ఉన్న పాలకవర్గానికి ఒక్క క్షణం ఆశ్చర్యం కలిగించింది. అదే సోషల్ మీడియాను ఉపయోగించి, అదే టెక్నాలజీని ప్రతిభావంతంగా ఉపయోగించి ప్రభుత్వానికి సవాలుగా నిల్చునే ఈ తరం, ఈ జెన్ జీ అన్ని రకాల పార్టీలనూ, టెలివిజన్ ఛానళ్లనూ ఆశ్చర్యంలో ముంచేత్తేసింది. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ముందుకు వచ్చిన ఈ నిరసన ఒక్క నీట్ పేపర్ల పరిష్కారం కోసం మాత్రమే రాలేదు. ఎన్నాళ్ళ నుండో గూడు కట్టుకున్న నిరాశ యువతరంలోంచి బయటికి వచ్చి ఇలా రోడ్ల వెంబడి నడిచింది.

1990ల తర్వాత ప్రారంభమైన ప్రపంచీకరణా, ఆర్థిక సరళీకరణలూ విదేశాల నుండి పెట్టుబడులు తీసుకొచ్చి దేశాన్ని స్వర్ణయుగంగా మార్చేస్తాయని కలలు అమ్ముకుంటూ ప్రభుత్వాలు బతికాయి. ఫారెక్స్ నిలువలు భయంకరమైన స్థాయికి పడిపోవడంతో ఇక వీలుకాని పాలకవర్గం బయటి దేశాల పెట్టుబడులకు తలవంచి ఆయా అంతర్జాతీయ కాబూలీవాలా ఆర్థిక సంస్థలు ఎలాంటి షరతులు విధించినా సరే ఆ షరతులకు కట్టుబడి ఆ పెట్టుబడులను ఆహ్వానించే ఒక ప్రక్రియ 1990ల తర్వాత ఆరంభమైంది. ఇది కూడా పెట్టుబడిదారీ వ్యవస్తే. కాకపోతే, దీన్ని మరింత అందంగా ప్యాక్ చేసి అందించే ప్రక్రియ కొనసాగింది. ఇకనుంచైనా దేశం ఆర్థిక పరిస్థితి అంచెలంచెలుగా మెరుగుపడుతుందని భారత ప్రజల్ని ఆశల ప్రపంచంలో ముంచారు. ఆర్థిక ప్రగతి సాధారణ ప్రజలకు అందకుండా కుబేర్లు పంచుకున్నారు. ఈ రకమైన ఆర్థిక ప్రగతి ఆసరాగా తీసుకొని అటు బయటి దేశం బడా కార్పొరేటు వర్గం, ఇటు స్వదేశంలోని కార్పొరేటర్లు తమ లాభాలు పెంచుకున్నారు. ప్రతి సంవత్సరం వస్తున్న ఆక్స్ ఫామ్ నివేదికలు ఈ విషయాన్ని ఎన్నెన్నో గణాంకాలతో ధ్రువీకరిస్తున్నాయి. సాధారణ మనిషి చేతిలో ఇంటర్నెట్, ఫోన్ పే, గూగుల్ పే లాంటివి చేరినప్పటికీ కూడా ఇవి మన సాధారణ జీవితాన్ని కాస్తంత సౌలభ్యం చేశాయన్నమాట కాదనలేం. కానీ ప్రపంచీకరణతో ఇంత మాత్రం సౌలభ్యం మాత్రమే యువత కోరుకోలేదు. భయంకరమైన నిరుద్యోగానికి పరిష్కారాలు కోరుకుంది. ఆదాయాల్లో పెరుగుదల కోరుకుంది. మరింత నాణ్యమైన జీవితాన్ని జీవించాలని ఆశపడ్డారు. కనీసం ఇతర పెట్టుబడిదారీ దేశాల్లో కనిపించే కనీస నాణ్యమైన జీవితాలను మనదేశంలో చూడలేదు. కాస్తంత ఐటి సెక్టర్లో చిన్న చిన్న ఉద్యోగాలు కనిపించాయి. అవి తప్ప మెజారిటీ వర్గానికి ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోయాయి. ప్రభుత్వాల బాధ్యత వ్యాపారం కాదనే తప్పుడు వాదనలు మన మెదళ్ళలో నింపేశారు. పబ్లిక్ సెక్టార్ బలహీనం కావడం ఆరంభమైంది. ఎన్నెన్నో సంస్థలు, ఎన్నెన్నో కర్మాగారాలు మూతపడ్డాయి. కార్పొరేట్లకు ఆదాయ పన్నుల్లో విపరీతమైన రాయితీలు కొనసాగాయి. స్పెషల్ ఎకనామిక్ జోన్ అంటూ ఆయా జోన్లలో ఫ్యాక్టరీలు స్థాపించి ఎన్నెన్నో సౌలభ్యాలు కార్పొరేట్లు అనుభవించారు. పిపిపి మోడల్ అంటూ మెడికల్ కాలేజీల నిర్వహణలోకి ప్రవేశించారు. అత్యంత చవకగా భూములు కొనేసుకున్నారు. కానీ వాగ్దానం చేసిన విధంగా సాధారణ మనిషికి ఏ రకమైన న్యాయం కూడా ఈ వైద్యశాలలు అందివ్వలేదు. విద్య, వైద్యం పూర్తిగా మార్కెటీకరణకు గురయ్యాయి. విద్యా రంగం నేడు పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లోకి మళ్ళింది. ఇక సాధారణమైన జబ్బు వస్తే నయం చేసే ప్రభుత్వ ఆసుపత్రులు అంతంత మాత్రమే ఉండగా, ప్రైవేటు ఆసుపత్రులు షాపింగ్ మాల్స్ లాగా సిద్ధమైపోతున్నాయి. వైద్యం, ట్రీట్మెంట్ దయగ్నోస్టిక్ పరిశ్రమ, వాటికి అవసరమైన భారీ యంత్రాలు, ఆపరేషన్ల హంగామా, ఇన్సూరెన్స్ పాలసీలు మూడు పువ్వులూ ఆరు కాయలుగా భారతదేశంలాంటి పేద దేశాల్లో వర్ధిల్లుతున్నాయి. ఒక తొమ్మిదో క్లాసు అమ్మాయి తల బాధ, కాళ్లు పీకుతున్నాయని డాక్టర్ దగ్గరికి వెళ్తే ఏకంగా మొదటి స్టేజీలోనే ఎమ్మారై సజెస్ట్ చేస్తున్నారు. ఇది నిజమైన సంఘటన. మోకాళ్ళ సర్జరీ ఒక పరిశ్రమగా మార్చే శారు. ఒక సాధారణ ట్రీట్మెంట్ ఇచ్చి చూడడం లేదు. క్లినికల్ దయాగ్నాసిస్ అనే మాట పూర్తిగా మాయం అయిపోయింది. క్వాలిటీ ఉన్న వైద్యులు కూడా ఎంతోమంది కార్పొరేట్ టార్గెట్ల కింద నలిగిపోతున్నారు.

జనంసాక్షి

ఆదాయ పంపిణీలో అసమానతలు మరింత పెరిగిపోతున్నాయి. అభివృద్ధి ఫలాలు పేదవాడికి అందలేదు. ఇలాంటి విపత్కర పరిణామాల నేపథ్యంలో వచ్చిన బొద్దింకల పార్టీ ద్వారా దేశం అమలు చేస్తున్న ఆర్థిక ప్రణాళికలను మరోసారి పునర్విచారణ జరుపుకోవాలని యువత పరోక్షంగా గుర్తుచేస్తోంది. కబుర్లు, కాకరకాయలతో ప్రభుత్వాలు నడవవనీ, మంత్రివర్గానికి బాధ్యత ఉందనీ, మంత్రులు రాజులు కారనీ, ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సిన బాధ్యత పాలకవర్గానికి ఉంటుందనీ, లాఠీలు పరిష్కారం కావనీ కాక్రోచ్ పార్టీ నేడు గుర్తు చేసింది. ఉద్యమం నడిపిన కాక్రోచ్ పార్టీకి ఉద్యమ అనుభవాలు లేకపోవచ్చు. రాజనీతి, ఆర్థిక అంశాలలో అపారమైన అనుభవం లేకపోవచ్చు. రాజకీయ పరిపక్వత లేకపోవచ్చు. చాలా ఉద్యమాల లాగానే ఇది కూడా సద్దుమనిగిపోవచ్చు. కానీ, ఈ కుర్రాళ్ళు ప్రశ్నించిన ప్రశ్నలు పాలక వర్గానికి బాధ్యతను గుర్తు చేస్తున్నాయని చెప్పవచ్చు. వారి దేహాలపై నిర్దాక్షిణ్యంగా పడిన లాఠీలు భారత ప్రజల హృదయాలను కలచి వేశాయనడంలో సందేహం లేదు.



కేశవ్
ఆర్థిక సామాజిక విశ్లేషకులు

# కనుమరుగైపోతున్న తెలంగాణ సాంప్రదాయ ఇస్తారి భోజనం

జనంసాక్షి

## మోదుగు ఆకుల ఇస్తారు నుంచి కోనసీమ అరటి ఆకు వరకు మారిన తెలంగాణ భోజన సంస్కృతి

తెలంగాణ పల్లెల్లో ఒకప్పుడు భోజనం అంటే కేవలం ఆకలి తీర్చుకోవడం కాదు. అది సంస్కృతి, ఆతిథ్యం, ఆచారం, ఆరోగ్యకరమైన జీవన విధానం. పండుగైనా, పెళ్లైనా, పుట్టినరోజైనా, దేవుడి కార్యక్రమమైనా, సామూహిక విందైనా భోజనానికి ప్రత్యేక స్థానం ఉండేది. ఆ భోజనానికి మరింత ప్రత్యేకతను ఇచ్చేది మన తెలంగాణ సంప్రదాయ ఇస్తారు. మోదుగు ఆకులతో తయారు చేసిన ఇస్తారుపై అన్నం, పప్పు, కూరలు, పచ్చళ్ళు, పాయసం వడ్డిస్తే వచ్చే రుచి, పరిమళం, ఆత్మీయత ప్రత్యేకమైనవి. ఒకప్పుడు ప్రతి తెలంగాణ పల్లెలో కనిపించిన ఈ దృశ్యం నేడు క్రమంగా కనుమరుగవుతోంది.

"ఇస్తారు"ను అనేక ప్రాంతాల్లో విస్తరి, ఆకుపళ్లెం వంటి పేర్లతో కూడా పిలుస్తారు. ఆకులతో భోజనం చేయడం భారతీయ సంస్కృతిలో శతాబ్దాలుగా కొనసాగుతున్న పర్యావరణహిత సంప్రదాయం. సహజంగా కుళ్లిపోయే ఆకుపళ్లెములు ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడంలోనూ ఉపయోగపడతాయి.

తెలంగాణలో మోదుగు చెట్లు గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా ఉండేవి. ఆకులను సేకరించి, శుభ్రపరిచి, చిన్న కర్రలు లేదా సహజ తంతువులతో కలిపి పెద్ద ఆకుపళ్లెంగా తయారు చేసేవారు. ఇది కేవలం ఇంటి అవసరానికి పరిమితం కాలేదు. అనేక గ్రామాల్లో ఒక చిన్న కుటీర పరిశ్రమగా ఉండేది. ముఖ్యంగా మహిళలు, గ్రామీణ కుటుంబాలు ఆకులను సేకరించి, ఇస్తారులు తయారు చేసి, సంతలకు, పెళ్లిళ్లకు, మార్కెట్లకు సరఫరా చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందేవారు. అంటే ఇస్తారు కేవలం భోజనం పెట్టే పాత్ర కాదు; ఒక కుటుంబానికి ఉపాధి ఇచ్చే సహజ వనరు.

సిద్ధిపేట జిల్లాలో మోదుగు ఆకులతో ఇస్తారులు తయారు చేయడాన్ని ప్రోత్సహించేందుకు 2024లో మహిళల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఈ సంప్రదాయం పూర్తిగా అంతరించిపోలేదని చూపించింది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, గ్రామీణ మహిళలకు ఆదాయ మార్గం కల్పించడం వంటి లక్ష్యాలతో ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. అయితే గత కొన్ని దశాబ్దాల్లో తెలంగాణ భోజన సంస్కృతిలో భారీ మార్పు వచ్చింది. పట్టణీకరణ, హోటళ్ల పెరుగుదల, వేగవంతమైన జీవన విధానం కారణంగా వివాహాలు, శుభకార్యాలు, సామూహిక కార్యక్రమాల్లో భోజనం వడ్డించే పద్ధతులు మారాయి. మోదుగు ఆకుల ఇస్తారుల స్థానంలో అరటి ఆకులు, కాగితపు పళ్లెములు, ప్లాస్టిక్ పళ్లెములు, ఇతర తయారుచేసిన పాత్రలు ప్రవేశించాయి. ముఖ్యంగా పట్టణాలు, జిల్లా కేంద్రాలు, హోటళ్లు, క్యాటరింగ్ రంగంలో అరటి ఆకుల వినియోగం పెరిగింది. కోనసీమ అరటి సాగుకు ప్రసిద్ధి కావడంతో అక్కడి నుంచి అరటి ఆకులు మార్కెట్లకు చేరడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. అయితే తెలంగాణలో అరటి ఆకుల వినియోగం ఎంత పెరిగిందనే విషయాన్ని ఖచ్చితమైన శాతంగా చెప్పాలంటే ప్రత్యేక అధికారిక సర్వే అవసరం. అరటి ఆకు చెడ్డదని చెప్పడం



కాదు. అది కూడా దక్షిణ భారతీయ ఆహార సంస్కృతిలో పురాతన సంప్రదాయం. అసలు ప్రశ్న తెలంగాణకు స్వంతమైన మోదుగు ఆకుల ఇస్తారు సంప్రదాయం ఎందుకు కనుమరుగవుతోందన్నదే.

ఒకప్పుడు మోదుగు చెట్టు తెలంగాణ పల్లె ప్రకృతిలో సాధారణ దృశ్యం. దాని ఆకులు, పూలు, కొమ్మలు గ్రామీణ జీవనంతో అనేక రకాలుగా అనుసంధానమై ఉండేవి. ఒక కుటుంబం ఆకులను సేకరించి, శుభ్రపరిచి, ఆరబెట్టి, ఇస్తారులు తయారు చేసి వారపు సంతలకు, గ్రామ మార్కెట్లకు, పెళ్లి ఇళ్లకు, హోటళ్లకు సరఫరా చేసేది. సేకరణ, తయారీ, రవాణా, విక్రయం ఈ మొత్తం ప్రక్రియలో అనేక చేతులకు ఉపాధి ఉండేది.

పరిశ్రమీకరణ, పట్టణీకరణ పెరిగిన కొద్దీ ఈ వ్యవస్థ బలహీనపడింది. గ్రామీణ యువత ఇతర ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లడం, చేతితో ఇస్తారులు తయారు చేసే నైపుణ్యం తరతరాలకు బదిలీ కాకపోవడం, వచ్చే ఆదాయం తక్కువగా ఉండటం వంటి కారణాలతో ఈ వృత్తి క్రమంగా వెనుకబడింది. మరోవైపు అరటి ఆకులకు వ్యవసాయ మార్కెట్, రవాణా, వ్యాపార గొలుసు ఏర్పడటంతో నగరంలోని హోటల్ యజమానికి స్థానికంగా ఇస్తారులు తయారు చేయించుకోవడం కంటే మార్కెట్‌లో అరటి ఆకుల కట్ట కొనడం సులభమైంది.

ప్లాస్టిక్ వినియోగం పెరగడం పరిస్థితిని మరింత దిగజార్చింది. తక్కువ ధరకు లభించే ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ పళ్లెములు, గ్లాసులు, చెంచాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ వాటి వినియోగం పెరిగింది. ఒకప్పుడు పెళ్లి భోజనానికి వందలాది ఇస్తారులు సిద్ధం చేసే కుటుంబాలు ఇప్పుడు మార్కెట్‌లో సిద్ధంగా లభించే వస్తువులపై ఆధారపడుతున్నాయి.

ఇస్తారు పునరుద్ధరణలో పర్యావరణ అంశం కూడా కీలకం. ఆకులతో తయారైన ఇస్తారులు సహజంగా జీవఅవక్షయానికి లోనవుతాయి. ఉపయోగించిన తరువాత సేంద్రియ వ్యర్థాలతో కలిపి నిర్వహించవచ్చు. అయితే "మోదుగు ఆకుపై భోజనం చేస్తే అనేక వ్యాధులు నయం అవుతాయి" వంటి శాస్త్రీయ ఆధారం లేని వాదనలను ప్రచారం చేయకూడదు. పరిశుభ్రమైన, సురక్షితమైన ఆకులను ఉపయోగించడం అత్యవసరం.

తెలంగాణ ఇస్తారు సంప్రదాయాన్ని పునరుద్ధరించాలంటే ముందుగా మోదుగు చెట్ల పరిరక్షణ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల కట్టలు, ప్రభుత్వ భూములు, పాఠశాలలు, సామూహిక స్థలాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మోదుగు వంటి స్థానిక వృక్షాలను పెంచాలి. ఇది పర్యావరణ కార్యక్రమంగానే కాకుండా గ్రామీణ ఉపాధి కార్యక్రమంగానూ ఉండాలి.

రెండవది, మోదుగు ఆకుల ఇస్తారు తయారీని మహిళా స్వయం సహాయక సంఘాలతో అనుసంధానం చేయాలి. ఆకుల సేకరణ, శుభ్రపరిచే విధానం, ఎండబెట్టడం, నిల్వ, ప్యాకేజింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వాలి. ప్రతి గ్రామంలో చిన్న ఇస్తారు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే స్థానిక ఉపాధి పెరుగుతుంది. మధ్యవర్తులపై ఆధారపడకుండా సంఘాలే నేరుగా మార్కెట్‌కు సరఫరా చేసే వ్యవస్థను అభివృద్ధి చేయాలి.

మూడవది, తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక కార్యక్రమాలతో దీనిని అనుసంధానం చేయాలి. పల్లె ఉత్సవాలు, జాతరలు, ఆహార ఉత్సవాలు, పర్యాటక కేంద్రాల్లో తెలంగాణ సంప్రదాయ ఇస్తారుపై స్థానిక వంటకాలను వడ్డించవచ్చు. హోటళ్లు, క్యాటరింగ్ సంస్థలు వారంలో ఒక రోజు "తెలంగాణ సంప్రదాయ భోజనం" నిర్వహించి మోదుగు ఇస్తారుకు మార్కెట్ కల్పించవచ్చు.

నాలుగవది, తెలంగాణలో జిల్లా వారీగా సమగ్ర సర్వే నిర్వహించాలి. ఎక్కడెక్కడ మోదుగు చెట్లు ఉన్నాయి? ఎన్ని కుటుంబాలు ఇస్తారులు తయారు చేస్తున్నాయి? ఉత్పత్తి ఎంత? ధర ఎంత? మార్కెట్ ఎక్కడ ఉంది? అరటి ఆకులు, ఇతర ప్రత్యామ్నాయాలతో పోటీ ఎలా ఉంది? వంటి అంశాలను అధ్యయనం చేయాలి. ఈ వివరాల ఆధారంగా ప్రత్యేక "తెలంగాణ ఇస్తారు పునరుజ్జీవన కార్యక్రమం" రూపొందించవచ్చు.

ఐదవది, పాఠశాలలు, కళాశాలల్లో తెలంగాణ సంప్రదాయాలపై అవగాహన కార్యక్రమాల్లో ఇస్తారు తయారీని కూడా చేర్చాలి. నేటి తరానికి మోదుగు చెట్టు ఎలా ఉంటుందో, ఇస్తారు ఎలా తయారు చేస్తారో తెలియకపోవచ్చు. ఒకప్పుడు తాతలు, అమ్మమ్మల ద్వారా సహజంగా నేర్చుకున్న జ్ఞానం ఇప్పుడు కనుమరుగవుతోంది. వృద్ధుల నుంచి ఈ జ్ఞానాన్ని నమోదు చేయడం, మౌఖిక చరిత్రగా భద్రపరచడం కూడా సాంస్కృతిక పరిరక్షణలో భాగమే.

ఆధునిక సాంకేతికతను సంప్రదాయంతో కలపడం అవసరం. ఆకులను శుభ్రపరచడం, పరిమాణం ప్రకారం వేరు చేయడం, ప్యాకేజింగ్, తేమ నియంత్రణ, నిల్వ వంటి పనుల్లో ఆధునిక పద్ధతులను ఉపయోగించవచ్చు. "తెలంగాణ మోదుగు ఇస్తారు" అనే ప్రత్యేక గుర్తింపుతో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ మార్కెట్‌లోకి తీసుకురావచ్చు. ఇలా చేస్తే అది సాధారణ ఆకుపళ్లెం కాకుండా ప్రత్యేక తెలంగాణ ఉత్పత్తిగా నిలబడే అవకాశం ఉంది.

తెలంగాణ సంస్కృతి అంటే కేవలం బతుకమ్మ, బోనాలు, జాతరలు, జానపద పాటలు మాత్రమే కాదు. మనం ఏమి తింటాం? ఎలా వండుతాం? ఎలా వడ్డిస్తాం? అతిథిని ఎలా గౌరవిస్తాం? ప్రకృతిని ఎలా ఉపయోగిస్తాం? గ్రామీణ వనరులను ఎలా పంచుకుంటాం? అన్నవి కూడా సంస్కృతిలో భాగమే. అందుకే ఇస్తారు భోజనాన్ని తెలంగాణ సాంస్కృతిక వారసత్వంలోని ఒక భాగంగా చూడాలి.

ఒకప్పుడు సాధారణంగా కనిపించిన వస్తువు విలువను అది కనుమరుగైన తరువాత గుర్తించడం మన సమాజంలో తరచూ జరుగుతుంది. ఇస్తారు పూర్తిగా కనుమరుగైన తరువాత దాని విలువను గుర్తించకముందే చర్యలు తీసుకోవాలి. ఒక మోదుగు చెట్టును నాటితే భవిష్యత్ తరానికి ఆకును అందించినట్టే. ఒక కుటుంబానికి ఇస్తారు తయారీ నేర్పితే ఉపాధి కల్పించినట్టే. ఒక హోటల్‌లో సంప్రదాయ ఇస్తారును ఉపయోగిస్తే ఆ సంస్కృతికి మార్కెట్ కల్పించినట్టే. ఒక పాఠశాలలో పిల్లలకు దాని గురించి చెబితే ఒక తరానికి జ్ఞానాన్ని అందించినట్టే.

కాబట్టి మోదుగు ఇస్తారు పునరుద్ధరణ అంటే గతాన్ని వెనక్కి తిప్పడం కాదు. గతంలోని మంచి సంప్రదాయాన్ని ఆధునిక మార్కెట్, శాస్త్రీయ పరిశోధన, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఉపాధితో అనుసంధానం చేయడం.

ఒక మోదుగు ఆకు చిన్నదే కావచ్చు. కానీ ఆ ఆకులో ఒక చెట్టు ఉంది. ఆ చెట్టులో ఒక పర్యావరణ వ్యవస్థ ఉంది. ఆ ఆకుతో తయారైన ఇస్తారులో ఒక కుటుంబం శ్రమ ఉంది. ఆ ఇస్తారుపై వడ్డించిన భోజనంలో ఒక సంస్కృతి ఉంది. ఆ భోజనాన్ని పంచుకున్న మనుషుల మధ్య ఒక బంధం ఉంది. ఆ బంధంలో తెలంగాణ పల్లె జీవితం ఉంది. అందుకే మోదుగు ఆకును కాపాడటం అంటే కేవలం ఒక ఆకును కాపాడటం కాదు. ఇస్తారును కాపాడటం అంటే కేవలం ఒక పళ్లెంను కాపాడటం కాదు. ఇస్తారు భోజనాన్ని కాపాడటం అంటే తెలంగాణ పల్లె జ్ఞాపకాలను, గ్రామీణ ఉపాధిని, ప్రకృతితో మనిషి అనుబంధాన్ని, మన ఆతిథ్య సంస్కృతిని కాపాడటం.

మన భోజన సంస్కృతి మన చరిత్రకు అద్దం.

మన ఆకుపళ్లెం మన ప్రకృతితో ఉన్న బంధానికి ప్రతీక.

మన ఇస్తారు మన గ్రామీణ జీవనానికి గుర్తు.

మోదుగు ఆకును కాపాడటం అంటే తెలంగాణ పల్లె సంస్కృతిలోని ఒక జీవంతమైన అధ్యాయాన్ని కాపాడటం.



డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో తహసిల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతిపత్రం



**మర్పల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ మర్పల్లి మండల అధ్యక్షుడు కే. రమేష్ పేర్కొన్నారు. గురువారం టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మర్పల్లి మండల తహసిల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదురుగుంటున్న సమస్యలు పిఆర్సి, పెండింగ్ డిఏలు, సిపిఎస్ రద్దు, జీవో నెంబర్ 25 ను సవరించుట, అన్ని యాజమాన్యాల లో పోస్టులను భర్తీ చేయాలని రెగ్యులర్ ఎంఈఓ, డీఈవో పోస్ట్ లను భర్తీ చేయాలని వారన్నారు. కేజీబీవీఆర్ఎస్ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను ట్రైన్ స్కేల్ ఇవ్వాలని ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుందరయ్యా, మోసిన్ మండల అధ్యక్షుడు, కె. రమేష్ మండల ప్రధాన కార్యదర్శి, రవి, ఖాజా మొయినుద్దీన్, మచ్చేందర్, బి యాదయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.


## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్



**బొంరాస్‌పేట, ఆగస్టు 13 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఉచిత యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ బందెయ్య యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉదయం పూట అల్పాహారం , ఉచిత యూనిఫామ్, టై,బెల్ట్ లను ప్రభుత్వము ఉచితంగా అందజేయడం విద్యార్థులకు గొప్ప విషయం అన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభమైందని మూడు సంవత్సరాలు నిండిన విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, మండలం మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కవిత,సిసీ కృష్ణయ్య,వార్డు సభ్యులు సంధారం లక్ష్మి,వెంకటయ్య, శ్రీనివాస్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి



**తాండూరు, అగస్టు 13 (జనంసాక్షి) :** పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అధికారులను అదేశించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని ఇరిగేషన్ శాఖ డీఈ శంకర్, ఏఈలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తాండూర్ నియోజకవర్గంలో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో, పర్యటనను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కాగ్నా నదిలో మురుగు నీరు కలవకుండా అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, నది పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. నియోజకవర్గ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, వాటి నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి పురోగతిపై కూడా ఆరా తీశారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు



**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మెదక్ ఆర్ డి ఓ రమాదేవి అన్నారు. గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్న ఏర్పాట్లను ఆర్డీవో పరిశీలించారు. వేడుకలు నిర్వహించనున్న ప్రదేశాన్ని సందర్శించి వేదిక, పరేడ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీవో సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ నవీన్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు సంబంధిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో రూ.48 కోట్లతో ఆధునిక ప్రభుత్వ పాఠశాల

- ఆగస్టు 17న భూమిపూజ..
- కేజీ నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**రామచంద్రాపురం, ఆగస్టు 13 (జనం సాక్షి) :** పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో తెల్లాపూర్‌లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మించనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం తెల్లాపూర్‌లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక పాఠశాల నిర్మించనున్న స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. డిజిటల్ తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన క్రీడా మైదానంతోపాటు ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్‌లో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఆగస్టు 17న భూమిపూజ

నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ఆగస్టు 17న భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**కొడంగల్, ఆగస్టు 13 (జనం సాక్షి) :** ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారము కోడంగల్ నియోజకవర్గంలో నిర్మిస్తున్న శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరా స్వామి దేవస్థానం పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించారు. దేవాలయం నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవాలయ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, ఇప్పటివరకు పూర్తయిన పనులు, చేపట్టాల్సిన తదుపరి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని, అవసరమైన సామగ్రి, సిబ్బంది తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని దేవాలయ నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పనుల పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గారితో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యు వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ వస్వరాజ్, గుట్టుర్,కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, తహసిల్దార్ రాంబాబు,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**శామీర్ పేట్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తుర్కపల్లి వార్డు కార్యాలయ పరిధిలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు మొక్కలను చైర్ పర్సన్ కంటం శీరిష కృష్ణారెడ్డి, కమీషనర్ వేంకట్ రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుర్కపల్లి పరిధిలోని ఐదు వార్డులకు మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శీరిష కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు హపావత్ వెంకటేష్, గురుకుల దీపిక వెంకటేష్, దాసరి రవి, యెల్లు దీపిక, మొహమ్మద్ యూసుఫ్ బాబా, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కంఠం శీరిష కృష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ



బాధ్యతను తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు పచ్చని, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పంపిణీ చేసిన మొక్కలను ఇళ్ల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో నాటి, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాలని ప్రజలను కోరారు.

## బషీరాబాద్ పోస్ట్ ఆఫీస్ అప్‌గ్రేడ్ చేయాలి



**తాండూరు, అగస్టు 13 (జనంసాక్షి) :** తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండల కేంద్రంలో ఉన్న పోస్ట్ ఆఫీస్‌ను అప్‌గ్రేడ్ చేసి అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేంద్ర కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో మంత్రిని కలిసిన ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బషీరాబాద్ మండలం తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉందని, ఈ ప్రాంతంలోని సుమారు 40కి పైగా గ్రామాల ప్రజలు పోస్టల్, బ్యాంకింగ్, పార్సిల్ సేవల కోసం బషీరాబాద్ పోస్ట్ ఆఫీస్‌పైనే ఆధారపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పోస్ట్ ఆఫీస్‌లో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల కొరత ఉందని, దీనివల్ల గ్రామీణ ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బషీరాబాద్ పోస్ట్ ఆఫీస్‌ను సబ్ పోస్ట్ ఆఫీస్ స్థాయి నుండి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లేదా హెడ్ పోస్ట్ ఆఫీస్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని, అదనపు సిబ్బందిని నియమించాలని, డిజిటల్ సేవలు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సౌకర్యాలు కల్పించాలని ఎంపి కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. బషీరాబాద్ పోస్ట్ ఆఫీస్ అప్‌గ్రేడ్ అయితే సరిహద్దు ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బషీరాబాద్ మండల ప్రజలు ఎంపితో పాటు ఉన్నారు.

## నాణ్యమైన విద్యే లక్ష్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి



**తాండూరు, అగస్టు 13 (జనంసాక్షి) :** తాండూరు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన నోట్స్‌ను ప్రభుత్వం ఉచితంగా అందజేసే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలకు సంబంధించిన నోట్స్‌ను అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి హాజరై విద్యార్థులకు నోట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు భారంగా మారకుండా ఉచిత మెటీరియల్ అందించడం మా ఉద్దేశం. విద్యార్థుల భవిష్యత్తే మా లక్ష్యం. నాణ్యమైన విద్య అందించడమే మా ధ్యేయ మని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నోట్స్ వల్ల విద్యార్థులకు కోచింగ్, గైడ్‌ల కోసం అయ్యే ఖర్చు తగ్గుతుందని, ఫలితాలు కూడా మెరుగవుతాయని కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సీపీ సుమతి ఆకస్మిక తనిఖీ

- ఏసీపీ కార్యాలయ ఏర్పాట్లపై సమగ్ర పరిశీలన
- సీఐలతో నేర నియంత్రణ,శాంతిభద్రతలపై సమీక్ష



**బోడుప్పల్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** రాచకొండ పోలీస్ కమిషనర్ సుమతి గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసు శాఖ పనితీరు,మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లిలో ఏర్పాటైన ఏసీపీ కార్యాలయాన్ని పరిశీలించి,పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మేడిపల్లి, ఘట్‌కేసర్,పోచారం,చర్లపల్లి తదితర పోలీస్ స్టేషన్ల సీఐలతో సమావేశమైన సీపీ సుమతి శాంతిభద్రతల పరిస్థితి,పెండింగ్ కేసుల దర్యాప్తు, నేరాల నియంత్రణ చర్యలు,రౌడీషీటర్లు,పాత నేరస్థులపై నిఘా అంశాలపై సమీక్షించారు. రాబోయే పండుగల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణ,మహిళల భద్రత,ట్రాఫిక్ నిర్వహణ అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి సురేష్ కుమార్,ఏసీపీ మోహన్ కుమార్,మేడిపల్లి సీఐ జలందర్ రెడ్డి,ఘట్కేసర్ సీఐ బాలస్వామి,పోచారం సీఐ జగన్నాథ్,చర్లపల్లి సీఐ సుదాకర్,ఎస్ఐలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రీన్‌వుడ్ కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు

- జలమండలి అధికారులతో కలిసి పర్యటించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్, ఆగస్టు 13 (జనం సాక్షి) :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌వుడ్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ సదుపాయం లేక కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీటి పారుదల సక్రమంగా జరగడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. కాలనీవాసుల సమస్యను పరిష్కరించేందుకు గతంలోనే కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి అధికారులతో చర్చించి డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి సంబంధించి ఎస్టిమేషన్స్ రూపొందించేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే అనంతరం జరిగిన డివిజన్ విభజన కారణంగా పనుల్లో జాప్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరోసారి జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్తగా ఎస్టిమేషన్స్ రూపొందించి, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని జలమండలి సిబ్బంది రాజేందర్‌కు సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కళ్లెం నవజీవన్ రెడ్డి కోరారు. కాలనీలో అవసరమైన పనులను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో త్వరగా పూర్తి



చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గణేష్, జలమండలి సిబ్బంది రాజేందర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

- మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవం
- పోచమ్మ గుడి నిర్మాణానికి స్థల పూజ
- శానాయిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



**రేవల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి) :** రేవల్లి మండలంలోని శానాయిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి హాజరై ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ. 20 లక్షలతో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం గ్రామానికి చెందిన కీ.శే. పెద్దిరెడ్డి శేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి గార్ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్థలాన్ని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా స్థలదాతల కుటుంబాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి అభినందించారు. అనంతరం గ్రామానికి కావలసిన ప్రాథమిక సహకార సంఘం గోదాం నిర్మాణం కోసం భూమి పూజ చేశారు.

### మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవం

గ్రామంలో మహిళల అభ్యున్నతి కోసం మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులతో మహిళ సమాఖ్య భవనాన్ని నిర్మించి, నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళా సమాఖ్య భవనానికి కీర్తిశేషులు సవాయి వంశస్థుల జ్ఞాపకార్థంగా వారి వంశస్థులు స్థలం విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెగా రెడ్డి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

శానాయిపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎత్తపు శేషమ్మ భర్త నరేష్, సవాయి రేణుక భర్త బాలనాగయ్య లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేసి, కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### పోచమ్మ గుడి నిర్మాణానికి స్థల పూజ

శానాయిపల్లి గేటు సమీపంలో గ్రామానికి చెందిన కీ.శే. మేకల రాములు జ్ఞాపకార్థం పోచమ్మ గుడి నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ మేకల కృష్ణయ్య స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి స్థల పూజ నిర్వహించారు. త్వరలోనే గుడి నిర్మాణం పూర్తి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గోపాల్ పేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కే వెంకటేష్, వైస్ చైర్మన్ మంద సత్యశిలా రెడ్డి, రేవల్లి మండల అధ్యక్షుడు సుల్తాన్ అలీ, పీఏసీఎస్ అధ్యక్షులు లోడే రఘు యాదవ్, జిల్లా కార్యదర్శి వాడల పర్వతాలు ఉమ్మడి గోపాల్పేట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అరెకంటి సిరిమల్లేష్, తిరుపతయ్య, బండరాయిపాకుల గ్రామ సర్పంచ్ దూపం రాజు, ఉపసర్పంచ్ సుకుమార్ రెడ్డి, రేవల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మిద్దె స్వామి, ఏదుల మండల అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి, కేశంపేట గ్రామ సర్పంచ్ బాదపల్లి రేవతి గౌడ్, నాగపూర్ సర్పంచ్ లోడే అంజనమ్మ, రేవల్లి సర్పంచ్ టప్ప రాజయ్య, కొంకి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, బాలస్వామి, సుబ్బారెడ్డి, కొమ్మిడి రవి పాల్గొన్నారు.

## మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల సాయం



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** రాజమండ్రిలో ఈ నెల 3వ తేదీన జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన మెడికో విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి జీఎస్ఎల్ విద్యాసంస్థలు మానవతా సాయం అందించాయి.ప్రియాంక ఎంబీబీఎస్ చదివే క్రమంలో జీఎస్ఎల్ కళాశాలలో విద్యనభ్యసిస్తోంది. ప్రతిభావంతురాలైన ప్రియాంక అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబం కుదేలైంది. ఈ విషయం తెలుసుకున్న జీఎస్ఎల్ యాజమాన్యం వెంటనే స్పందించింది.సంస్థ తరపున ప్రతినిధులు నేరుగా ఎక్లాస్పూర్ గ్రామానికి చేరుకుని ప్రియాంక తల్లిదండ్రులు వెంకటేష్, చంద్రకళను కలిశారు. వారి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ప్రియాంక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. "ప్రియాంక ఒక ప్రకాశవంతమైన భవిష్యత్తు కలిగిన వైద్యురాలు. ఆమె కోల్పోవడం మాకు తీరని లోటు" అని కళాశాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రియాంక కుటుంబ బాధ్యత తమదేనని జీఎస్ఎల్ యాజమాన్యం భరోసా ఇచ్చింది. ప్రియాంక తల్లిదండ్రులు సంస్థ సాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## దత్తక్షేత్రంలో హీరో శ్రీకాంత్ సందడి



**మక్తల్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** మక్తల్ మండలంలోని పసుపుల వద్ద పవిత్ర కృష్ణా నది ఒడ్డున వెలసిన శ్రీ దత్త క్షేత్రాల్లో ప్రముఖ హీరో శ్రీకాంత్ సందడి చేశారు. హీరో శ్రీకాంత్ పవిత్ర శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా గురువారం రోజు దత్త క్షేత్రానికి మిత్రులతో కలిసి వచ్చారు. పసుపుల గ్రామం వద్ద వెలసిన శ్రీ క్షేత్ర శ్రీ వల్లభపురం దత్త క్షేత్రం వద్ద ప్రవహిస్తున్న కృష్ణానది నది ఆవలి ఒడ్డున ఉన్న కురువపురం దత్తక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు స్వామివారి దర్శనం అనంతరం తిరిగి స్టీమర్ లో శ్రీపాద శ్రీ వల్లభాపురం దత్తక్షేత్రంలోనూ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు హీరో శ్రీకాంత్ ను చూడగానే కేరింతలు కొడుతూ ఆయనతో కరాచాలనం చేసి ఫోటోలు దిగేందుకు ఎగబడ్డారు. పెద్ద ఎత్తున అభిమానులు తన వద్దకు రావడంతో ఏమాత్రం విసుక్కోకుండా ఆయన అందరినీ ఆప్యాయంగా పలకరించి వారితో ఫోటోలు దిగారు. శ్రావణమాసం సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ కు దత్తక్షేత్రం నిర్వాహకులు స్వామివారి దర్శనం చేయించి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి



**కొమురవెల్లి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** హమాలీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ప్రకటించిన హామీ ప్రకారంగా హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ సిఐటియు సిద్దిపేట జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు కొమురవెల్లి తాసిల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఉమేష్ గారికి వినతిపత్రం ఇచ్చారు అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చి వాటిని తుంగలో దక్కిందని హమాలీ కార్మికులను పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికులందరికీ హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి రాష్ట్రంలో ఉన్నటువంటి అమాలి కార్మికులందరికీ గుర్తింపు కార్డు లు జారీ చేసి, అసంఘటిత కార్మికులుగా నమోదు చేయాలి ఈశ్రం పోర్టల్ లో హమాలీ కార్మికుల పేర్లను నమోదు చేసి సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలి 55 సంవత్సరాలు పైబడిన కార్మికులకు నెలకు 6000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఇండ్లు లేని కార్మికులకు ప్రభుత్వమే 120 గజాల భూమి కొనుగోలు చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలి హమాలి పని చేస్తూ ప్రమాదంలో మరణించిన కార్మికులకు 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు ఇవి కాకుండా అమాలి కార్మికులందరికీ ప్రమాద బీమా సహజ మరణ పరిహారం ఆరోగ్య బీమా విద్యా సహాయం ప్రసూతి ప్రయోజనాలు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ నాయకులు మెతుకు రమేష్ పుల్లంపల్లి సాయిలు ఆరుట్ల రవీందర్ తేలు నరసింహులు మలకని కనకయ్య అల్దే స్వామి దండు రవి కృష్ణ దొంతర పోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలోఅభివృద్ధి పనులకు శ్రీకారం

- మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాలఆనంద్ కుమార్



**కల్వకుర్తి, ఆగస్టు 13 (జనంసాక్షి) :** కల్వకుర్తి మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ 3వ, 22వ వార్డుల్లో పర్యటించారు. శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా 3వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను, 22వ వార్డులో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కల్వకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కేతావత్ రాము, ఎజాస్, మక్బుల్, నాయకులు, శివకాలనీ వాసులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించాలి

- కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ



**హత్నూర, ఆగస్టు 13 (జనం సాక్షి) :** కల్లు గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణ డిమాండ్ చేశారు.శాసన సభ ఎన్నికల ప్రణాళికలో భాగంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గీత కార్మికులు చేపట్టిన చైతన్య బస్సు యాత్ర గురువారం హత్నూర మండలానికి చేరుకోగా స్థానిక గౌడ సంఘం నాయకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా దౌల్తాబాద్ ప్రధాన కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పలు డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ,ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు,కార్యదర్శి రమేష్ గౌడ్ లు మాట్లాడుతూ ఈ నెల 2 నుండి 18వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు.ప్రతి నెలా రూ.4వేలు పెన్షన్ తో పాటు 10లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.యాభయేళ్ళు పైబడిన గీత కార్మికులందరికీ పెన్షన్,ఈత చెట్ల పెంపకం కోసం ప్రతి సొసైటీకి ఐదెకరాల భూమి ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్ర బడ్జెట్లో నీరాకు కేటాయించిన రూ. 25కోట్లు,గీత కార్మికుల సంక్షేమం కోసం కేటాయించిన 67వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 18న సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఆంజనేయులు గౌడ్,రాజా గౌడ్,శేఖర్ గౌడ్,లక్ష్మణ్ గౌడ్, నాగప్రభు గౌడ్,వెంకటేష్ గౌడ్,ధనుంజయ్ గౌడ్,మహేష్ గౌడ్,రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల మహాధర్నాను విజయవంతం చేయాలి



**బెజ్జంకి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు,రాష్ట్ర సాంస్కృతిక సారథి ఎలుక దేవయ్య సూచనలతో ఈ నెల 23వ తేదీన దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న మాలల మహాధర్నాను విజయవంతం చేయాలని గురువారం అంబేద్కర్ కూడలి వద్ద తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య పిలుపునిచ్చారు.అనంతరం అంజయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ మాలలకు చేస్తున్న అన్యాయం,ఏబీసీడీ వర్గీకరణ,రోస్టర్ విధానం తదితర అంశాల వల్ల,మాలలకు జరుగుతున్న నష్టాన్ని నిరసిస్తూ ఈ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మాలల హక్కులు,భవిష్యత్ ప్రయోజనాల పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ మహాధర్నాకు మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.రాష్ట్ర స్థాయి నాయకులు,సిద్ధిపేట జిల్లా మాల నాయకులు,దుబ్బాక నియోజకవర్గంలోని మాల కుటుంబ సభ్యులు,నాయకులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలి అనీ అన్నారు.ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ రావుల నరసయ్య,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల శేఖర్ బాబు,దామర శంకర్,రాజ మహేందర్,మాశం బాబు,సంగెం మధు, రాకమ ఆంజనేయులు,రమేష్,సాయి,దొంతుల రాయమల్లు, తిరుపతి,చంద్రయ్య,లక్ష్మణ్, యాస బాబు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుండి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. జిల్లాలోని పంటల వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు , సెప్టెంబర్ మాసాలలో ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని, వరి పంటను సాగు చేస్తున్న రైతులు వరి సాగు కోసం ఎక్కువ నీరు అవసరం అవుతుందని, ఆగస్టు సెప్టెంబర్ మాసాల్లో వర్షాలు తగ్గడం వల్ల వరి పంటలు ఎండిపోయే అవకాశం ఉందని, పంటలు ఎండిపోవడం వల్ల దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లోని గ్రామ సర్పంచులకు, రైతులకు ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, విస్తరణ అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- సీఐటీయూ మండల కన్వీనర్ సంఘ ఎల్లయ్య




**బెజ్జంకి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి,వారి సంక్షేమం కోసం హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సంఘ ఎల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీకాంత్ కు హమాలీ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం సంఘ ఎల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వంన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.హమాలీలకు హెల్త్ కార్డులు,ప్రమాద బీమా,ఆరోగ్య సదుపాయాలు,పెన్షన్,పని ప్రదేశాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.హమాలీ పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని,55 ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు.ఐఎల్ఓ నిబంధనల ప్రకారం 50 కేజీలకు మించి బరువులు మోయడాన్ని నిషేధించాలి అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు బి.చంద్రయ్య,నరసింగం,శ్రీకాంత్,సత్తయ్య,రాజు తదితరులు పాల్గొన్నారు.


## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేటు లేఅవుట్లను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లేఅవుట్లలో రోడ్ల వెడల్పు, హద్దులు, ప్లాట్ల విభజన, మౌలిక సదుపాయాలకు కేటాయించిన స్థలాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ విస్తరణ దృష్ట్యా భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా లేఅవుట్లలో రహదారులు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, రహదారులు, ప్రజా అవసరాల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో ఇబ్బందులు పడకుండా లేఅవుట్ల అనుమతులు, రికార్డులు, స్థల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి) :** పెద్దమందడి మండలం బుగ్గపల్లి వద్ద ఉన్న 75 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కను నాటారు. అనంతరం మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకట రమణతో కలిసి నీటి శుద్ధి ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు.ప్లాంట్‌లో నీటి ప్రవాహం, ఫిల్టరేషన్ ప్రక్రియకు సంబంధించిన ఫ్లో దయాగ్రామ్‌ను కలెక్టర్ పరిశీలించారు. గౌరిదేవిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు ప్లాంట్‌కు ఏ విధంగా చేరుతుంది, ప్లాంట్‌కు చేరిన అనంతరం వివిధ దశల్లో నీటిని ఏ విధంగా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్లాంట్‌లోని నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను కలెక్టర్ సందర్శించారు. నీటి వడపోత (ఫిల్ట్రేషన్) ప్రక్రియ, నీటి నాణ్యతను పరీక్షించే విధానం, శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్లాంట్ నుంచి ప్రజలకు సరఫరా చేసే సమయంలో ఉన్న నీటి నాణ్యత క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరే వరకు అదే స్థాయిలో కొనసాగుతుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు క్షేత్రస్థాయిలో కూడా నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నీటి శుద్ధి ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ అంజద్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెదురు సాగుతో అదనపు ఆదాయం పొందాలి

▫ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



మహదేవపూర్, ఆగస్టు 13 (జనంసాక్షి): రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు వెదురు సాగును చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న వెదురు మొక్కల నర్సరీని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ, పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు సాగు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలికంగా లాభాలను అందించే ఆదాయ వనరుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు వెదురు సాగును ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆరు మండలాల్లో వెదురు మొక్కల పెంపకం కొనసాగుతోందని, సుమారు 70 వేల వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1,200 మంది రైతులను వెదురు సాగు కోసం గుర్తించినట్లు, 15 కుంటల భూమికి ఒక్కో రైతుకు 60 వెదురు మొక్కలను ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. వెదురు సాగు చేపట్టిన రైతులకు వివిజి రాంజీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం వెదురు సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. అనంతరం నర్సరీని సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామ సంఘం అధ్యక్షురాలిని జిల్లా కలెక్టర్ అభినందించారు. నర్సరీ నిర్వహణలో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, కాటారం ఆర్డీఓ రవీందర్, ఇండస్ట్రీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ తాండ్ర సురేష్, స్థానిక సర్పంచ్, గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

▫ పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, ఆగస్టు 13(జనంసాక్షి) : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లాలో ఈ నెల 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కి ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని అధికారులను సూచించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి ఎనిముల రేవంత్ రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నం సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం వనదేవతల సన్నిధి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారిని గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రం నకు చేరుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పెద్ద ఎత్తున రహదారి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసే సభలో ప్రజలు, అభిమానులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ములుగు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

▫ ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఆగస్టు 15న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆగస్టు 15న ఉదయం 9:30 గంటలకు జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని కలెక్టర్ వెల్లడించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, స్వాతంత్య్ర సమరయోధులు, అధికారులు, విద్యార్థులు, యువత, జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.

## ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

▫ అభివృద్ధి పనుల పురోగతిపై క్షేత్రస్థాయి పరిశీలించిన బల్దియా కమిషనర్ టి.వెంకన్న



వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 13(జనంసాక్షి): నగర పరిధిలోని కమర్షియల్ భవనాల యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం హన్మకొండ పరిధిలో ఫైర్ సేఫ్టీ నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీకి సంబంధించి ఎర్రగట్టుగుట్ట వద్ద ఉన్న వైన్ పాఠశాలతో పాటు భీమారంలోని ఎస్ఎస్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ పరికరాలను కమిషనర్ పరిశీలించారు. అగ్ని ప్రమాదాల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా పరికరాలు అందుబాటులో ఉన్నాయా, అవి నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేశారా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరికరాల ఏర్పాటు, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బల్దియా ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టి పూర్తిచేసిన 22వ డివిజన్‌లోని సుజిత్‌సింగ్‌నగర్, 13వ డివిజన్‌లోని ఎం.హెచ్.నగర్‌లో నిర్మించిన సీబిట్ కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ప్రక్రియ కోసం పనుల నాణ్యత, పురోగతి తదితర వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 19వ డివిజన్ పరిధిలోని సొసైటీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. అలాగే కరీమాబాద్, బట్టల బజార్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపునకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసి, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా ఫైర్ అధికారి శంకర్ లింగం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ బాబు, డిప్యూటీ ఇంజనీర్ రంగారావు, స్టేషన్ ఫైర్ అధికారి రాజేశ్వర్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్లు మురళీకృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అఘాయిత్యం

▫ నిందితుడి అరెస్ట్

వరంగల్ ఈస్ట్, ఆగస్టు 13 (జనం సాక్షి) : మట్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేసిన ఆటోడ్రైవర్ సంగాల విజయ్‌కుమార్ (38)ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హాస్టల్‌లో ఉంటున్న బాలికను నిందితుడు మాయమాటలతో బయటకు తీసుకువచ్చి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో బాలిక మౌనంగా ఉండిపోయింది. ఇటీవల అనారోగ్యానికి గురైన బాలికను తల్లి ప్రశ్నించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షల్లో బాలిక గర్భవతి అని తేలింది. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు వాహన తనిఖీల్లో నిందితుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై బీఎన్ఎస్, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి 15 రోజుల జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మైనర్ అయినందున బాధితురాలి వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.

## ఆర్ట్స్ కళాశాలలో క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 13 (జనం సాక్షి) : హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వాహకులు సుదర్శన్ ఆధ్వర్యం లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి నాణ్యమైన ఆహారం, అల్పాహారం అందుబాటులో ఉండేలా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుకారి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం నూతన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం సంతోషకర మన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా క్యాంటీన్ నిర్వహణ కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహ్మాన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి శివారులో బాంబుల స్టోరేజీకి రంగం సిద్ధం

▫ జంగేడు సమీపంలో ఫిట్ మ్యాగజిన్ ఏర్పాటుకు సింగరేణి, ఫైర్‌శాఖ స్థల పరిశీలన..

▫ ఇక ఇక్కడి నుండే ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ గనులకు డిటోనేటర్ల సరఫరా..



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి శివారులోనే ఇకపై గనులకు అవసరమైన బాంబులు, డిటోనేటర్ల నిల్వ జరగనుంది.. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం జంగేడు శివారులో ఫిట్ మ్యాగజిన్ ఏర్పాటు చేసేందుకు గురువారం సింగరేణి, ఫైర్‌శాఖ అధికారులు స్థల పరిశీలన నిర్వహించారు. సర్వే నంబర్లు 1626, 1627లో ఉన్న సుమారు ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో మైన్ డిటోనేటర్లు, ఎక్స్‌ప్లోజివ్‌ల నిల్వ కోసం మూడు ప్రత్యేక భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**గోదావరిఖని నుంచి తెచ్చే శ్రమ తగ్గనుంది..**

ప్రస్తుతం భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ గనులకు అవసరమైన డిటోనేటర్లు, ఎక్స్‌ప్లోజివ్‌లను సుమారు 60 కిలోమీటర్ల దూరంలోని గోదావరిఖని నుంచి వాహనాల ద్వారా తరలిస్తున్నారు. దీంతో రవాణా ఖర్చు పెరగడంతో పాటు భద్రతాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జంగేడు శివారులోనే మ్యాగజిన్ అందుబాటులోకి వస్తే రవాణా దూరం, వ్యయభారం తగ్గడంతో పాటు గనులకు పేలుడు పదార్థాల సరఫరా వేగంగా జరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**కేంద్ర అనుమతుల కోసం ఎదురుచూపు..**

మ్యాగజిన్ నిర్మాణానికి సంబంధించిన అంచనాలు, సాంకేతిక నివేదికలు ఇప్పటికే పూర్తయ్యాయి. అయితే పేలుడు పదార్థాల నిల్వకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా అనుమతులు రావాల్సి ఉంది. ఆ అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సింగరేణి అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఈ మ్యాగజిన్ ఏర్పాటుతో భూపాలపల్లి ఏరియా గనుల్లో ఉత్పత్తి మరింత వేగవంతం కావడంతో పాటు భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ప్రవేశ మార్గాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. ఇకపై భూపాలపల్లి గనులకు జంగేడు శివారు నుండే డిటోనేటర్ల సరఫరా జరగనుండటంతో స్థానికంగా ఉత్పత్తికి మరింత ఊతం లభించనుంది. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సర్వేయర్ శైలేంద్రకుమార్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మందమర్రి జీఎం



బెల్లంపల్లి, ఆగస్టు 13, (జనంసాక్షి) : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను గురువారం సింగరేణి మందమర్రి జీఎం రాధకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సింగరేణి సంస్థకు సంబంధించిన పలు అంశాలపై పరస్పరం చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సింగరేణి సంస్థ తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రకు రేషన్ బియ్యం అక్రమ రవాణా

▫ గుట్టురట్టు ముగ్గురిపై కేసు బైక్ సీజ్



సిర్పూర్ (టి) (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న ఒక నెట్‌వర్క్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఛేదించారు. సిర్పూర్-టి మండలం పారిగాం బ్రిడ్జి వద్ద జరిపిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న అక్రమ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈ దాడిలో సిర్పూర్ మండలం కోనేరు కాలనీకి చెందిన జి. తిరుపతి, వెంకట్రావ్ పేట గ్రామానికి చెందిన చౌదరి మోరేశ్వర్, మరియు జితేందర్ అనే ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు వీరి దగ్గర నుండి 6 ప్లాస్టిక్ బస్తాల్లో ప్యాక్ చేసిన సుమారు 3.35 క్వింటాళ్ల రాయితీ రేషన్ బియ్యంతో పాటు రవాణాకు ఉపయోగించిన ఒక ద్విచక్ర వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజ్ కుమార్ చౌదరి మోరేశ్వర్ ని విచారించగ మహారాష్ట్రలోని పొడ్సా గ్రామంలో రేషన్ బియ్యం కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా ఒక దుకాణాన్ని ఏర్పాటు చేశాడని తెలంగాణ సరిహద్దు గ్రామాల నుండి ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల ద్వారా తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి, వాటిని అక్రమంగా మహారాష్ట్రలోని వీరూర్‌కు తరలించి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని దారిమళ్లించి దుర్వినియోగం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు.

## అవయవ దానం ఒక గొప్ప సామాజిక బాధ్యత

▫ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ




వరంగల్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) : 'అవయవ దాన దినోత్సవం' సందర్భంగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి-సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఏ.ప్రదీప్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మల గీతాంబా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ "మనిషి మరణించిన తరువాత కూడా మరొకరి జీవితంలో వెలుగును నింపగలగడం కంటే గొప్ప మానవతా సేవ మరొకటి ఉండదు అని పేర్కొన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్ల వంటి అవయవాలను అవసరమైన వారికి అందించడం ద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. న్యాయసేవాధికర సంస్థ కార్యదర్శి-సీనియర్ సివిల్ జడ్జి ఎ. ప్రదీప్ మాట్లాడుతూ "న్యాయ సేవా సంస్థల పరంగా కూడా ప్రజలకు వారి చట్టపరమైన హక్కులు, అవయవ దానానికి సంబంధించిన విధానాలు మరియు కుటుంబ సభ్యుల పాత్ర గురించి అవగాహన కల్పించే దిశగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రజా సమూహాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు అని దీనికి ప్రతి ఒక్కరి సహకారం అందించాలని కోరారు. వరంగల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సి.హెచ్.ఉపేందర్ రావు మాట్లాడుతూ "ఒకరి జీవితానికి ముగింపు వచ్చినా, మరొకరి జీవితానికి కొత్త ఆరంభం ఇవ్వవచ్చునని తెలిపారు. కే.ఎం.సి. ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ మాట్లాడుతూ 'అవయవ దానం - మరణం తర్వాత కూడా జీవించే మానవత్వం" అనే భావనను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి అని వివరించారు. రీజనల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ 'మన సమాజంలో అవయవ దానం గురించి ఇంకా అనేక అపోహలు, భయాలు ఉన్నాయి. అవగాహన లేకపోవడం వల్ల ఎంతోమంది అవసరమైన అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారు అని తెలిపారు. అందువల్ల అవయవ దానం గురించి శాస్త్రీయమైన మరియు వాస్తవమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా సూచించారు. ఈ సందర్భంగా లఘు చిత్రాలను ప్రదర్శింపజేసి సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులకు వివరించారు. కార్యక్రమంలో యం.జి.యం.హాస్పిటల్ ఆర్.యం.ఓ. డాక్టర్ సనత్ రోషన్ హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, డాక్టర్లు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14 ఆగస్టు 2026

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి) :** షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో కమిషన్ సభ్యులతో కలిసి ఎస్సీ, ఎస్టీల భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలు, ప్రమోషన్లలో రిజర్వేషన్ అమలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సబ్‌ప్లాన్ నిధులను ఇతర పనులకు మళ్లించకుండా ఎస్సీ, ఎస్టీ ఆవాసాల అభివృద్ధికే వినియోగించాలని వెంకటయ్య స్పష్టం చేశారు. నిధులు మిగిలితే ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులకు కేటాయించాలని సూచించారు. ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని, అన్యాయం జరిగితే కమిషన్ సహించదని హెచ్చరించారు. ఎంపీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్‌డీఎఫ్ నిధులను రిజర్వేషన్ నిబంధనల ప్రకారం కేటాయించాలని కోరారు. మిర్యాలగూడ డివిజన్‌లోని శూన్యపహాడ్--గణేష్‌పహాడ్ రోడ్డు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసులను జాప్యం లేకుండా పరిష్కరించి శిక్షల శాతాన్ని పెంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. చండూరు మండలం అంగడిపేటకు చెందిన ఎస్సీ మహిళ మేకల బుచ్చమ్మ ఇంటి వివాదాన్ని విచారించి పరిష్కరించాలని సూచించారు. వెంకటయ్య జిల్లాలో ఎస్సీ, ఎస్టీ దాడుల కేసుల్లో బాధితులకు చెల్లించాల్సిన రూ. 1.89 కోట్ల పరిహారం త్వరగా



అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రితో జరిగే హైపవర్ కమిటీ సమావేశంలో కోరనున్నట్లు వెల్లడించారు. గుడితాండ పునరావాస కేంద్రానికి సంబంధించి 130 మందికి పరిహారం అందని అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. నల్గొండ బైపాస్ వద్ద ఉన్న అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను తొలగించకుండా కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, అత్యాచార కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తున్న అడ్వకేట్ దర్శన్‌కు గన్‌మెన్ భద్రతను పునరుద్ధరించాలని ఎస్పీని కోరారు.
రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు ముఖ్యమంత్రి వెయ్యి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని, మరో వెయ్యి ఇళు ఇస్తామని హామీ ఇచ్చారని వెంకటయ్య తెలిపారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరనున్నట్లు చెప్పారు.
కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసుల పరిష్కారం, డ్రగ్స్ నియంత్రణలో పోలీసు, రెవెన్యూ శాఖలు చేస్తున్న కృషిని అభినందించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, శూన్యపహాడ్--గణేష్‌పహాడ్ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు.
మరో సభ్యుడు రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేసేందుకు కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీల భూముల విషయంలో ఆధిపత్యాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, గుడితాండ ఆర్‌అండ్‌ఆర్‌లో తండ్రులకు పరిహారం అందినా కొడుకులకు ప్యాకేజీ అందని అంశంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.
జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసుల్లో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి రెండుసార్లు సమావేశాలు నిర్వహించామని, ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.
జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఏడాది సుమారు 90 నుంచి 100 వరకు ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 54 కేసులు విచారణలో ఉండగా, ఇప్పటివరకు ఆరు కేసుల్లో కోర్టుల ద్వారా శిక్షలు విధించబడినట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కే. లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శశికళ, డీటీడీవో కమలాకర్, డీఎఫ్ఓ రాజశేఖర్, డీఆర్వో దశరథ్, ఆర్డీవోలు, డీఎస్పీలు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.


## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14 (జనం సాక్షి) :** వేపలగడ్డ గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించి విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ అవసరమయ్యే బియ్యం, ఇతర సరుకుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వసతి గృహ పరిసరాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే టీయూడబ్ల్యూజే ధ్యేయం




**నవాబ్‌పేట, ఆగస్టు 13 (జనం సాక్షి) :** దశాబ్దాల కాలంగా నిర్దిష్టమైన ప్రణాళికతో జర్నలిస్టుల హక్కుల కోసం టియుడబ్ల్యూజే (ఐజేయు) రాజీలేని పోరాటం చేస్తోందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షుడు కాటం నాగరాజు గౌడ్ తెలిపారు. నవాబ్‌పేట మండలంలో నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, జర్నలిస్టులకు నూతన మెంబర్‌షిప్‌లు పంపిణీ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, నూతన ప్రతినిధులు విలేకరుల హక్కుల పరిరక్షణకు నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నవాబ్‌పేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆనంద్ (వార్తావేదిక), అధ్యక్షుడిగా రాఘవేంద్ర చారి (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షుడిగా శేఖర్ (వార్త), ప్రధాన కార్యదర్శిగా స్వామి (క్యూ న్యూస్), కోశాధికారిగా సూర్య నాయక్ (వే టు న్యూస్), సంయుక్త కార్యదర్శిగా భాను (బీటీ న్యూస్), జాయింట్ సెక్రెటరీగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా నర్సింలు (ప్రజాతంత్ర), రవి (విజన్ ఆంధ్ర), రాహుల్ (మెట్రో న్యూస్), శంకర్ (గిరిజన సంస్కృతి)లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జిల్లేల రఘు, నాయకులు సీనియర్ జర్నలిస్ట్‌లు రఘునాథ రావు, చంద్రశేఖర్ గౌడ్, చిక్కా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు కూలి విద్యార్థిని మృతి

- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- హాలీమా కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

**భువనగిరి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భగాయిత్ ప్రభుత్వ పాఠశాలలో చెట్టు కూలి మైనార్టీ వర్గానికి చెందిన విద్యార్థిని ఎండీ. హాలీమా మృతి చెందడం ప్రభుత్వ యంత్రాంగం ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తీవ్రంగా విమర్శించారు. ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో



ప్రమాదకరంగా ఉన్న చెట్లను ముందుగానే గుర్తించి తొలగించాల్సిన విద్యాశాఖ, స్థానిక అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన పాఠశాలలే వారికి ప్రాణసంకటంగా మారడం ఆందోళనకరమన్నారు. చెట్టు కూలిన ఘటనలో విద్యార్థిని హాలీమా మృతి చెందడం తీవ్ర విషాదకరమని, గాయపడిన చిన్నారులను పరామర్శించడం తమను కలచివేసిందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని హాలీమా కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఆర్థిక సహాయం అందించాలని బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బాధిత మైనార్టీ కుటుంబానికి ప్రభుత్వం పూర్తి అండగా నిలిచి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు ప్రభుత్వ ఖర్చులతో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లు, భవనాలు, ఇతర మౌలిక వసతులను తక్షణమే పరిశీలించి విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలిన సంబంధిత అధికారులపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాయ దశరథ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, కొప్పుల యాదిరెడ్డి, చందా మహేందర్‌గుప్తా, కపిల్, ఉడత భాస్కర్, పృథ్వి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమార్, మంగు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో బైక్ దొంగల ముఠా అరెస్ట్

**సదాశివపేట, ఆగస్టు 13 (జనంసాక్షి) :** సదాశివపేట పట్టణంలో గత కొన్ని నెలలుగా ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీకి గురైన ఆరు బైకులు, నేరానికి వినియోగించిన మరో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లి గ్రామానికి చెందిన పెద్దవాగు బుచ్చి రాములు, సదాశివపేట మండలం ఆత్మకూరుకు చెందిన మునిపల్లి సుధాకర్, జహీరాబాద్ మండలం తుంకుంటకు



చెందిన బోయిని ప్రదీప్ నిందితులుగా పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో వీరిని పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేష్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సైలు లక్ష్మారెడ్డి, నగేష్, క్రైమ్ టీమ్ హెచ్‌సీ రామకృష్ణ, పీసీలు వెంకటేశం, అమానుల్లా, నహీద్ పాషాలను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

## విద్యుత్ ఉచ్చుకు బీట్ ఆఫీసర్ బలి

- వేటగాళ్లపై కొరడా ఝుళిపించిన అటవీ శాఖ ఘటనాస్థలిని పరిశీలించిన డీఎఫ్ఓ
- అక్రమ విద్యుత్ లైన్లపై నోటీసులు
- అటవీ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత
- డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రం సింగ్

**బూర్గంపహాడ్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** అడవి జంతువుల వేట కోసం ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ ఉచ్చులు ఓ అటవీ ఉద్యోగి ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో అటవీ శాఖ అప్రమత్తమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం చెరువు సింగారం వెస్ట్ బీట్ పరిధిలో రెండు రోజుల క్రితం విధి నిర్వహణలో విద్యుత్ ఉచ్చుకు గురై మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) బానోత్ నవీన్ ఘటనాస్థలిని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) సిద్ధార్థ విక్రం సింగ్ గురువారం పరిశీలించారు. విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన డీఎఫ్ఓ.. అటవీ శాఖ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను గుర్తించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై విద్యుత్ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశంపైనా సమగ్ర విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

### రైతులకూ నోటీసులు.. పూర్తి స్థాయి విచారణ

విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసిన ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న రైతులకు సైతం నోటీసులు జారీ చేసి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తామని డీఎఫ్ఓ తెలిపారు. అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదకరమైన చర్యగా పేర్కొంటూ.. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



### 'ఇకపై సిబ్బంది భద్రతే తొలి ప్రాధాన్యం'

విధి నిర్వహణలో అటవీ శాఖ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రం సింగ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే కిందిస్థాయి అధికారులు, సిబ్బంది రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఒక అటవీ ఉద్యోగి విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం పట్ల శాఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తుండగా.. ఈ ఘటన అనంతరం అక్రమ విద్యుత్ ఉచ్చులపై అటవీ, విద్యుత్ శాఖలు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## దేశభక్తి, ఐక్యతకు ప్రతీకగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



**రాజేంద్రనగర్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** దేశభక్తి, ప్రజల్లో ఐక్యతను పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం నలందనగర్, ఉప్పరపల్లి ప్రాంతాల్లో కిడ్జీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆమె తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం పెద్దల బాధ్యత అన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల గురించి పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని పేర్కొన్నారు. త్రివర్ణ పతాకాలు చేతబట్టి "భారతమాతాకీ జై" నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరోజ, లక్ష్మి, శారద, స్పందన, నాగదుర్గ, పద్మ, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు. కోకాపేటలో కోకాపేట గ్రామంలో బిజెపి నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు మెండే నాగేశ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు దేశభక్తి జాతీయ ఐక్యతను పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్, బిక్షపతి యాదవ్, శివరాజ్ గణేష్, జైపాల్ రెడ్డి, అనిల్, బ్రహ్మచారి, చెన్నయ్య, సురేందర్, కృష్ణ, రాజేశ్వర్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులతో మార్పు తథ్యం

- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు
- తప్పు చేయకపోతే జంకు ఎందుకు?
- సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** సువిశాల భారతదేశానికి ప్రధాని అయిన నరేంద్రమోడి పిరికివాడిగా మారిపోయాడని, ఆయనకు ట్రంప్ ఫోబియా పట్టుకుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. 145 కోట్ల జనాభా గలిగిన దేశానికి ప్రధాని అయినప్పటికీ అల్పసంఖ్యాకులైన సంపన్నులు కార్పోరేట్ల కోసం మాత్రమే పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సిపిఐ జన చైతన్య యాత్రల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన జరిగింది. వందలాది మంది పార్టీ కార్యకర్తలు, కళాకారుల ప్రదర్శనతో వైరా రోడ్ అరుణావర్ణం పులుముకుంది. అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ... ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చాయన్నారు . ఇప్పుడు దేశంలో మార్పు సైతం, కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందని ఇది తథ్యమని అన్నారు. ఎన్నికలు ఆర్థిక వ్యవహారంతో ముడిపడి కోట్లు ఖర్చు చేస్తున్నవారు మాత్రమే విజయం సాధిస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టులు సీట్లు గెలవలేకపోవచ్చు కానీ, గెలుపు ఓటములను, శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందన్నారు. మోడి, అమిత్ షాలు తప్పు చేశామన్న భావనతో ఉన్నారని, అందుకే పార్లమెంట్ వచ్చేందుకు జంకుతున్నారన్నారు. మోడికి తిరోగమనం ప్రారంభమైందని, సబ్బండ వర్గాలు ఆయన పాలనను వ్యతిరేకిస్తున్నాయన్నారు.
బిఆర్ఎస్ డబుల్ బెడ్రూం ఇండ్ల మాదిరే కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రాజకీయ వివక్ష పాటిస్తుందని, జెండా కప్పుకుంటునే ఇండ్లు కేటాయిస్తామనటం సరికాదన్నారు. సీతారామ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియచేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మోడి ప్రజా వ్యతిరేక విధానాల పైనా, రాష్ట్రంలో హామీల అమలు కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని హేమంతరావు స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగిచగా , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సభలో సిపిఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, అజ్మీరా రామమూర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి, కళాకారులు సతీష్ బృందం అలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.




### అరుణావర్ణమైన ఖమ్మం పురవీధులు


ఖమ్మం పురవీధులు గురువారం ఎరుపెక్కాయి. మోడి విధానాలను నిరసిస్తూ, రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్పోరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో సిపిఐ పాదయాత్ర నిర్వహించింది. మమత ఆసుపత్రి వద్ద డాక్టర్ బాగం కిషన్ రావు సిహెచ్ సత్యనారాయణరెడ్డి పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి సత్కరించారు. వైరా రోడ్లో డాక్టర్ గోర్కి ఆసుపత్రి సిబ్బంది ఏలూరి కృష్ణప్రసాద్ నేతృత్వంలో పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. జమ్మిబండ సమీపంలో గల పోటు ప్రసాద్ స్మారక స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని జమ్ముల జితేందర్ రెడ్డి ఆవిష్కరించగా, షేక్ జానిమియా, కొండపర్తి గోవిందరావు, బిజి క్లైమెంట్, మల్లేష్, వరద నరసింహారావు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




# ‘ప్రయాణించక ముందే టిప్’.. ఇక కుదరదు

### రైడ్ యాప్‌లకు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ:**రైడ్ యాప్‌లలో క్యాబ్/ఆటో/బైక్ సేవల కోసం బుక్ చేసుకునే సమయంలో.. ‘అడ్వాన్స్ టిప్’ ఇస్తారా? అనే సందేశం మనం చూస్తూనే ఉంటాం. మనం ఈ టిప్ పెంచినా కొద్దీ బుకింగ్ వేగం పెరుగుతుంటుంది. అయితే, రైడ్‌ను అంగీకరించడానికి లేక పూర్తిచేయడానికి ముందే ఇలా టిప్ అడొగద్దని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. దీన్ని ప్రమోట్ చేసే ఆప్షన్‌ను తక్షణమే తొలగించాలని అగ్రిగేటర్లకు కేంద్ర రవాణాశాఖ ఆదేశాలు ఇచ్చింది. క్యాబ్ త్వరగా వస్తుందనే ఆశతో ప్రయాణికులు అదనపు చెల్లింపులు చేసే పరిస్థితి తీసుకురావొద్దని పేర్కొంది. అగ్రిగేటర్లు వెంటనే తమ మొబైల్ యాప్స్‌ను సమీక్షించుకోవాలని, మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా లేని ఫీచర్‌ను తొలగించాలని రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇలాంటి ఫీచర్ల వల్ల అదనపు రుసుము చెల్లిస్తేనే.. వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందుతాయనే భావన యూజర్లలో ఉంటుందని పేర్కొంది. ఈ టిప్ విధానం పరోక్షంగా యూజర్లను బలవంతం చేయడమే అవుతుందనే ఆందోళన ఎప్పటినుంచో వ్యక్తమవుతోంది. అయితే తాజా ఆదేశాలతో ఈ టిప్ విధానాన్ని కేంద్రం పూర్తిగా నిషేధించట్లేదు. చట్టంలోని నిబంధనల ప్రకారం.. ప్రయాణికులు స్వచ్ఛందంగా ఇవ్వొచ్చు. కానీ, అది ప్రయాణం పూర్తయిన తర్వాతే ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. ఇక, టిప్ మొత్తం డ్రైవర్‌కే వెళ్లాలి. అందులో కొంతమొత్తాన్ని అగ్రిగేటర్ తీసుకోవడానికి వీల్లేదు. ఈ టిప్ విధానాన్ని నిపుణులు డార్క్ ప్యాటర్న్‌గా వ్యవహరిస్తున్నారు. మనకే తెలియకుండా మనచేత ఫలానా ఉత్పత్తి, సేవలను వినియోగించుకునేలా ప్రేరేపించడాన్ని డార్క్ పాటర్న్‌గా వ్యవహరిస్తారు. టిప్‌ఇస్తేనే రైడ్ త్వరగా బుక్ అవుతుందని యూజర్లను అగ్రిగేటరలు నమ్మిస్తున్నారు. దీంతో మనకు తెలియకుండానే సేవలకు అదనంగా చెల్లిస్తున్నామని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఫీచర్‌ను నిలిపివేయాలని సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది.



# ‘రిటెయిల్’ భగ్గుమంటోంది



**న్యూఢిల్లీ:**ఉల్లి, అల్లం లాంటి వంటగది నిత్యావసరాల ధరలు పెరగడంతో, జులైలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.45 శాతానికి చేరింది. ఆర్‌బీఐ నిర్దేశించుకున్న మధ్యస్థ లక్ష్యానికి మించి వరసగా రెండో నెలా ఇది నమోదుకావడం గమనార్హం. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా రిటెయిల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తారు. జూన్‌లో ఇది 4.38 శాతంగా ఉంది. 2024 ఆధార సంవత్సరంతో కొత్త సిరీస్‌లో ద్రవ్యోల్బణ గణాంకాలను విడుదల చేయడం ప్రారంభించాక, జులైలో నమోదైన 4.45 శాతమే ఇప్పటివరకు ఎక్కువ. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం జులైలో 5.52 శాతానికి పెరిగింది. జూన్‌లో ఇది 5.32 శాతంగా ఉంది. ఉల్లిపాయల ద్రవ్యోల్బణం 4.73% నుంచి 22.54 శాతానికి చేరింది. అల్లం ధరల్లో పెరుగుదల 84.62% కాగా, పెరగ్గా.. వెల్లుల్లి కూడా బాగానే ప్రియం అయ్యింది. బంగాళాదుంపలు, బెండ, టమాటాలు, బఠానీ ధరల్లో క్షీణత (ప్రతిద్రవ్యోల్బణం) నమోదైంది. జులైలో పట్టణ ప్రాంతంలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.96% కాగా... గ్రామీణ ప్రాంతంలో 4.84 శాతంగా నమోదైంది. తెలంగాణలో అత్యధికంగా 6.32%, అత్యల్పంగా మిజోరంలో 1.84% చొప్పున రిటెయిల్ ద్రవ్యోల్బణం ఉంది.

**స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 113+, నిఫ్టీ -40**

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభనష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ లాభాల్లో ముగియగా.. నిఫ్టీ వరుసగా మూడో రోజూ నష్టాల పరంపరను కొనసాగించింది. హర్మూజ్ తెరవడంపై నెలకొన్న అనిశ్చితి, చమురు ధరలు పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంక్, కన్జ్యూమర్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలు లాభనష్టాల్లో ఊగిసలాడాయి. సెన్సెక్స్ 113.61 పాయింట్లు లాభపడి 78,079.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 40.10 పాయింట్లు కోల్పోయి 24,395.85 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.44 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఇండిగో, ఎన్‌టీపీసీ, బీఈఎల్, ఎల్‌అండ్‌టీ, హిందూస్థాన్ యునిలీవర్, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఐసీఐసీఐ, టైటాన్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, టాటాస్టీల్ షేర్లు నష్టాలు చవి చూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌క్రూడ్ ధర 87.79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4,381.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# రూ.1 ఫ్రీడమ్ ప్లాన్‌ను మళ్లీ తీసుకొచ్చిన బీఎస్ఎన్ఎల్

**న్యూఢిల్లీ:**ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ 80వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కొత్త వినియోగదారుల కోసం తన ఫ్రీడమ్ ప్లాన్‌ను మళ్లీ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రూ.1కే ఉచిత సిమ్‌ను అందిస్తుంది. ఫస్ట్ రీఛార్జి ప్లాన్ ఉచితంగా లభిస్తుంది. 24 రోజుల పాటు అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, రోజుకు 1 జీబీ డేటా లభిస్తుంది. ఈ ఆఫర్ సెప్టెంబర్ 12 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ వేదికగా పేర్కొంది. గతేడాది స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ‘బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ప్లాన్’ పేరుతో రూ.1 ప్లాన్‌ను తొలుత తీసుకొచ్చింది. ఈ ప్లాన్ కింద 30 రోజుల వ్యాలిడిటీ ఇచ్చేది. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, 2జీబీ డేటా, అపరిమిత కాల్స్ అందించింది. ఫ్రీడమ్ 2.0 ప్లాన్‌లో భాగంగా తాజాగా ఈ ప్లాన్ వ్యాలిడిటీని 24 రోజులకు కుదించింది. రోజుకు 1జీబీ హైస్పీడ్ డేటాకే పరిమితం చేసింది. ఈ ప్లాన్ కొత్త వినియోగదారులకే... పాత బీఎస్ఎన్ఎల్ యూజర్లకు వర్తించదు.

**ఆ ప్లాన్‌పై అదనపు వ్యాలిడిటీ..**

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా.. తన రూ.2399 వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను బీఎస్ఎన్ఎల్ సవరించింది. సాధారణంగా 365 రోజుల వ్యాలిడిటీతో లభించే.. ఈ ప్లాన్‌కు మరో 47 రోజులను జోడించింది. అంటే 412 రోజుల కాలపరిమితి లభిస్తుంది. ఈ వార్షిక ప్లాన్ రీఛార్జ్ చేసుకున్న వినియోగదారులకు అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 12 మధ్య రీఛార్జ్ చేసిన యూజర్లకే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్
₹ 1,54,236 (22 క్యారెట్లు)
₹ 1,67,180 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,40,000

# పన్ను రిఫండ్ రాలేదా?

### ఆలస్యానికి కారణాలు ఇవే!




ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసిన వారిలో చాలా మంది రిఫండ్ కోసం ఎదురుచూస్తున్నారు. రిటర్నులు దాఖలు చేసిన కొన్ని గంటల్లోనే కొందరు రిఫండ్ అందుకోగా.. మరికొందరు మాత్రం వారాలు గడుస్తున్నా తమకు రిఫండ్ రాలేదని సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడతున్నారు. రిఫండ్ స్టేటస్ ఇంకా ‘అండర్ ప్రాసెస్’ అనే చూపిస్తోందంటూ కొందరు పేర్కొంటున్నారు. రిఫండ్ ఆలస్యానికి కారణమేంటి? ఇంతకీ స్టేటస్ ఎలా చెక్ చేయాలి?

**ఆలస్యానికి కారణాలు:**ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడంతో పాటు ఇ-వెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఆదాయపు పన్ను విభాగం రిటర్నులను ప్రాసెస్ చేస్తుంది. ఐటీఆర్ దాఖలు చేసిన 30 రోజుల్లోగా ఇ-వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ఆ ప్రక్రియ చేశారో లేదో చూసుకోండి. బ్యాంక్ అకౌంట్ ప్రీ వ్యాలిడేట్ చేయకపోవడం కారణంగానూ రిఫండ్ ఆలస్యం అవ్వొచ్చు. ఒకసారి మీ బ్యాంక్ వ్యాలిడేట్ చేసుందా లేదా చెక్ చేయండి. బ్యాంక్ ఖాతాలోని పేరు, పాన్ వివరాలతో సరిపోలని సందర్భంలోనూ రిఫండ్ జారీ అవ్వకపోవచ్చు. ఐటీఆర్‌లో పొందుపరిచిన బ్యాంక్ అకౌంట్ మూసివేయడం లేదా బ్యాంక్ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పున్న సందర్భాల్లోనూ రిఫండ్ రాదు. పాన్‌తో ఆధార్ అనుసంధానం కాని సందర్భంలోనూ రిఫండ్ మీకు రాకపోవచ్చు. అదే జరిగి ఉంటే ఎర్రర్ మెసేజ్ వస్తుంది. పాన్‌ను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని సూచిస్తుంది. ఐటీఆర్ ఫైలింగ్‌లో పొరపాట్ల కారణంగానూ రిఫండ్లు ఆలస్యం కావొచ్చు. ఆదాయం, వడ్డీ వివరాలు సరిగా పేర్కొనకపోవడం వంటివీ జాప్యానికి కారణం. ఏఐఎస్, 26ఏఎస్, టీడీఎస్ సర్టిఫికెట్లలో ఉన్న వివరాలను ఐటీఆర్‌లో పేర్కొనకపోవడం వల్ల కూడా ఆలస్యం కావొచ్చు. సాధారణంగా పెద్ద మొత్తంలో రిఫండ్ జారీ చేసే సమయంలో ఆదాయపు పన్ను విభాగం మరిన్ని ఎక్కువ తనిఖీలు చేస్తుంది. కొన్ని కేసుల్లో రిస్క్ ఆధారిత ధ్రువీకరణకు పంపించొచ్చు. ఈ కారణంగానూ రిఫండ్ జారీ ఆలస్యం కావొచ్చు.

రిఫండ్ స్టేటస్ ఎలా చెక్ చేయాలి?

టాప్ మెనూలో ఇ-ఫైలింగ్ విభాగంలోకి వెళితే.. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ వ్యూ ఫైల్డ్ రిటర్న్స్‌లోకి వెళితే రిఫండ్ స్టేటస్ కనిపిస్తుంది. అక్కడ అసెస్‌మెంట్ ఇయర్ వారీగా రిఫండ్ స్టేటస్ దర్శనమిస్తుంది. రిటర్నులు ఎప్పుడు సబ్మిట్ చేశారు? ఇ-వెరికేషన్ ఎప్పుడు చేశారు? ప్రాసెస్‌కు ఎన్ని రోజుల గడువు పట్టింది? రిఫండ్ ఎప్పుడు జారీ చేశారు వంటి వివరాలు అక్కడ కనిపిస్తాయి.

# టాటా సన్స్ పగ్గాలు నరేంద్రన్‌కేనా..?

## ఎవరీ టీవీ నరేంద్రన్..?

**టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలగనున్నట్లు నట రాజన్ చంద్రశేఖరన్ ప్రకటనతో టాటా గ్రూప్ నాయకత్వంలో మరోసారి అనిశ్చితి నెలకొంది. ఇప్పుడు టాటా సన్స్ పగ్గాలను ఎవరు చేపడతారనేది కార్పొరేట్ వర్గాల్లో పెద్ద ప్రశ్నగా మారింది. కాగా.. ఈ పదవి రేసులో టీవీ నరేంద్రన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇంతకీ ఈయన ఎవరు..? ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడితే.. ఆయన ముందున్న సవాళ్లేంటీ?**



**న్యూఢిల్లీ:**61 ఏళ్ల టీవీ నరేంద్రన్ ప్రస్తుతం టాటా స్టీల్ విభాగానికి మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. తదుపరి ఛైర్మన్‌గా ఈయన పేరును టాటా గ్రూప్ అధికా రికంగా ప్రకటించనప్పటికీ.. నరేంద్రన్‌కే బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కార్పొరేట్ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. టీవీ నరేంద్రన్ తిరుచిలోని ఎన్ఐటీలో ఇంజినీరింగ్ చదివా రు. ఆ తర్వాత ఐఐఎం కలకత్తా నుంచి మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆయన.. 1988లో టాటా గ్రూప్‌లో చేరారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఇదే గ్రూప్‌లో పనిచేస్తున్నారు. తొలినాళ్లలో సేల్స్, మార్కెటింగ్, ఇంటర్నేషనల్ బిజినెస్ వంటి విభాగాల్లో పనిచేశారు. ఆగ్నేయ ఆసియాలో టాటా స్టీల్‌ను విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు. 2013లో టాటా స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేంద్రన్.. ఆ తర్వాత సీఈఓగా పదోన్నతి పొందారు. కాగా.. తదుపరి ఛైర్మన్ రేసులో ఈయనతో పాటు నోయెల్ టాటా, సౌరభ్ అగర్వాల్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చంద్రశేఖరన్ పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. అప్పటిలోగా కొత్త ఛైర్మన్‌ను టాటా సన్స్ ఎంపిక చేయాల్సి ఉంటుంది.

కొత్త ఛైర్మన్‌కు 3 సవాళ్లు..

ఇదిలా ఉండగా.. టాటా సన్స్ తదుపరి ఛైర్మన్‌కు మూడు కీలక సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రస్తుతం ఎయిరిండియా, టాటా డిజిటల్, టాటా ఎలక్ట్రానిక్స్ విభాగాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియా నష్టాలు దాదాపు రెండు రెట్లు పెరిగి రూ.22,238 కోట్లకు చేరాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన.. పశ్చిమాసాయి యుద్ధం వంటి పరిస్థితులు ఈ ఎయిర్‌లైన్ వృద్ధికి అడ్డంకిగా మారాయి. ఇక, గతేడాది టాటా డిజిటల్ ఆదాయం పెరిగినప్పటికీ.. రూ.4,974కోట్ల మేర నష్టాన్ని చవిచూసింది. ఈ విభాగానికి చెందిన బిగ్‌బాస్కెట్ 10-మినట్ డెలివరీ విధానంలోకి ఆలస్యంగా రావడం ప్రతికూల ఫలితాన్నిచ్చింది. దీంతో ఇతర ఈ-కామర్స్ సంస్థల నుంచి పోటీ తీవ్రమైంది. మరోవైపు, టాటా న్యూ యాప్.. మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ఆదరణ దక్కించుకోలేకపోయింది. ఈ సవాళ్లను దాటి కొత్త ఛైర్మన్ టాటా సన్స్‌ను ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

కొత్త ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ షురూ

చంద్రశేఖరన్ స్థానంలో కొత్త ఛైర్మన్‌ను నియమించే ప్రక్రియ ప్రారంభమైంది. సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. పునర్నియామకం కోరబోనని చంద్రశేఖరన్ లేఖ రాసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త ఛైర్మన్ నియామకం కోసం ఒక వ్యక్తిని సిఫార్సు చేయడం కోసం వీలైనంత త్వరగా ఎంపిక కమిటీని ఏర్పాటు చేసేందుకు సర్ దొరబ్జీ టాటా ట్రస్ట్ ట్రస్టీలు తీర్మానాన్ని ఆమోదించారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

# చర్చలతో వివాదానికి ముగింపు పలకండి..

ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఇచ్చిన అనుమతిని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను జస్టిస్ మిలింద్ జాదవ్ విచారించారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతిపై వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా దీనిని పట్టుకుని కూర్చోకుండా ముందుకు సాగాలని జడ్జి స్పష్టం చేశారు. ఇరుపక్షాలు కూర్చుని ఆచరణాత్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం పలు బ్యాంకుల నుంచి మాల్యా దాదాపు రూ.9,000 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాలను చెల్లించకపోవడంతో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు పరారయ్యారు. దీంతో 2019లో ఆయన్ను “పరారైన ఆర్థిక నేరస్థుడి”గా ప్రకటించారు. చట్ట ప్రకారం మాల్యా ఆస్తులను జప్తు చేసి రుణాల రికవరీకి చర్యలు చేపట్టారు. దీంతో ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును తన పిటిషన్లలో ప్రశ్నించారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే.. మాల్యా తొలుత భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని కోర్టు సూచించింది. అయితే, బ్రిటన్ కోర్టుల ఆంక్షల కారణంగా మాల్యా భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పలేమని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు, మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు వీలుగా బ్రిటన్‌తో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# ‘తప్పుడు ప్రచారం చేస్తే కేసులు’..

### ఫుడ్ ఇన్‌ఫ్లూయెన్సర్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ వార్నింగ్

**న్యూఢిల్లీ:**సామాజిక మాధ్యమాలు తెరిస్తే చాలు.. ఆహార పదార్థాలను ప్రమోట్ చేసే వీడియోలు బోలెడు దర్శనమిస్తుంటాయి. ఆ ప్రొడక్ట్ మంచిది.. ఈ ప్రొడక్ట్ అద్భుతం అంటూ ఇన్‌ఫ్లూయెన్సర్లు ప్రమోట్ చేస్తుంటారు. సెలబ్రిటీలూ ఇందుకు మినహాయింపు కాదు. ఫుడ్ కంపెనీలు కూడా సంప్రదాయ ప్రచారాలకు భిన్నంగా సామాజిక మాధ్యమాల్లో పెయిడ్ ప్రమోషన్లకు శ్రీకారం చుట్టాయి. ఈ ధోరణిపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దృష్టిసారించింది. ఆహార ఉత్పత్తులకు సంబంధించి వాస్తవాలు తెలుసుకోకుండా ప్రమోట్ చేస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని ఇన్‌ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలను హెచ్చరించింది. ఆహార పదార్థాలను ఆన్‌లైన్‌లో ప్రచారం చేసే సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు ఆధారాలు లేని, అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఈఊాంఎ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ప్రచారంతో పాటు బాధ్యత కూడా ఉండాలని ఇన్‌ఫ్లూయెన్సర్లకు సూచించింది. బ్రాండ్లను ప్రమోట్ చేసేముందు వారు చెప్పే విషయాలు నిజమా కాదా.. నిరూపించదగినవా? చట్టానికి లోబడి ఉన్నాయా లేదా? అనేది తనిఖీ చేసుకోవాలని సూచించింది. శాస్త్రీయ ఆధారాలు లేకుండా ‘రోగనిరోధక శక్తి పెంచుతుంది, సంపూర్ణ పోషకాహారం లభిస్తుంది’ అంటూ ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006, అడ్వర్టైజింగ్ అండ్ క్లెయిమ్స్ 2018 నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈఊాంఎ హెచ్చరించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలే కాకుండా.. వాటిని ఎండార్స్ చేయడమూ నేరంగా పరిగణిస్తామని పేర్కొంది. ఇటీవల తమ ఉత్పత్తులు నూరు శాతం స్వచ్ఛమైనవి అంటూ పేర్కొనడాన్ని తప్పుబడుతూ డాబర్ ఇండియా ఉత్పత్తులపై ఈఊాంఎ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీనిపై దిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఇన్‌ఫ్లూయెన్సర్లనూ ఈఊాంఎ అప్రమత్తం చేసింది.



# కార్చిచ్చుకు కారణమైన హెలికాప్టర్ ప్రమాదం..!

**వాషింగ్టన్:**అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో సైనిక హెలికాప్టర్ కూలిపోవడంతో కార్చిచ్చు చెలరేగింది. మంటలు వేగంగా వ్యాపించి క్షణాల్లో వందల ఎకరాల మేర గడ్డి దగ్ధమైంది. దీంతో సమీప ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సైనికులు మృతిచెందారు. సాలడో పట్టణం సమీపంలోని పొలంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇది అత్యంత తీవ్రమైన ఘటన అని బెల్ కౌంటీ షెరీఫ్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ప్రమాదానికి గురైంది ఏహెచ్-64 అపాచీ అటాక్ హెలికాప్టర్ అని ఫోర్ట్ హుడ్ సైనిక స్థావరం వెల్లడించింది. హెలికాప్టర్ కూలిన వెంటనే మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. బుధవారం సాయంత్రానికి కార్చిచ్చును 50 శాతం అదుపులోకి తెచ్చినట్లు టెక్సాస్ అగ్నిమాపకశాఖ తెలిపింది. హెలికాప్టర్ కూలిపోవడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు యూఎస్ మిలిటరీ అధికారులు తెలిపారు.

# దుకాణాలు తొందరగా మూసేయండి..!

### బంగ్లాలో విద్యుత్ సంక్షోభం

బంగ్లాదేశ్ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కరెంటు కోతలు ఎక్కువయ్యాయి. పరిస్థితి చాలా తీవ్రంగా మారడంతో విద్యుత్ వినియోగంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. షాపింగ్ మాల్స్, మార్కెట్లు, దుకాణాలు రాత్రి 8గంటల వరకే తెరచి ఉంచాలని ఆదేశించింది. ఇదే సమయంలో తమకు అదనంగా డీజిల్ సరఫరా చేయాలని భారత్‌ను సాయం కోరింది. ఇదే విషయంపై బంగ్లాదేశ్‌లోని భారత రాయబారి దినేశ్ త్రివేదీతో ఇటీవల జరిగిన భేటీలో చర్చించింది. రాజధాని ఢాకా మినహా అన్ని ప్రాంతాల్లో నిత్యం ఎనిమిది నుంచి 10 గంటలపాటు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. దీంతో పరిశ్రమలు దెబ్బతినడంతోపాటు రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్ర ఆగ్రహానికి గురవుతున్న స్థానికులు.. విద్యుత్ కేంద్రాలపై దాడులకు దిగుతున్నారు. దీంతో గ్రిడ్‌లు, సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాలకు పోలీసులు భద్రత కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక మీడియా పేర్కొంది. బంగ్లాదేశ్ తన ఇంధన అవసరాల కోసం చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడింది. ఇటీవల గ్యాస్ కొరత వల్ల దాదాపు 1500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో కొన్ని రోజుల క్రితం అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో అది మూతపడింది. విద్యుత్ కోతలతో రైతులు డీజిల్ మోటార్లపైనే ఆధారాపడాల్సిన పరిస్థితి నెలకొంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న టెక్స్‌టైల్స్, గార్మెంట్ రంగం కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఆసుపత్రులు, రెస్టరెంట్లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.

# యుద్ధనౌక నుంచి సముద్రంలోకి దూకి..

## అమెరికా నావికుల ఆత్మహత్యాయత్నం..!

**వాషింగ్టన్:**పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచ దేశాలను ఇంధన సంక్షోభంలోకి నెడితే.. యుద్ధరంగంలోని సైనికులకు మానసిక క్షోభ మిగుల్చుతున్నట్లు కనిపిస్తోంది. గల్ఫ్ జలాల్లో కొన్ని నెలలపాటు యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తిస్తోన్న సైనికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆహారం, మంచినీటి కొరత, అపరిశుభ్ర మరుగుదొడ్లు వారిని కుంగదీస్తున్నాయి. దాంతో యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ నౌకలోని అమెరికా నావికులు సముద్రంలోకి దూకి ఆత్మహత్యకు యత్నించారని అమెరికా పత్రిక మిలిటరీ టైమ్స్ కథనం పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అమెరికా పలు యుద్ధ నౌకలను పశ్చిమాసియా జలాల్లో మోహరించిన సంగతి తెలిసిందే. అబ్రహాం లింకన్‌లో ఐదు వేలమంది నావికులు, మెరైన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రికార్డు స్థాయిలో 250 రోజులుగా అది సముద్రజలాల్లోనే ఉంది. సుదీర్ఘ మోపరింపు, కఠిన పరిస్థితులు, మానసిక ఒత్తిడి సిబ్బందిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని గతంలోనే వార్తలు వచ్చాయి. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అటకెక్కడంతో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి కొనసాగుతోంది. మరోవైపు అబ్రహాం లింకన్ సహా ఇతర యుద్ధ నౌకలను ఉపయోగించి ఇరాన్ ఓడరేవులను యూఎస్ మరోసారి దిగ్బంధించింది. ఈ పరిస్థితులతో వారి మానసిక స్థితిని మరింత దిగజారినట్లు కనిపిస్తోంది. అలాగే తమవారిని మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామో తెలియని గందరగోళం నావికులు సముద్రంలో దూకడానికి కారణమై ఉంటుందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం ఆరుగురు నావికులు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఈ కథనాలను అమెరికా నేవీ అధికారులు తోసిపుచ్చారు.



**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉన్నంతకాలం యుద్ధం కొనసాగుతుందా..?**

ఐఆర్‌జీసీ చేసిన హెచ్చరిక ఇదే విషయాన్ని వెల్లడిచేస్తోంది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా అమెరికాతో యుద్ధాన్ని కొనసాగించొచ్చని ఐఆర్‌జీసీలోని సీనియర్ అడ్వైజర్ ఒకరు వ్యాఖ్యలు చేశారు. “యుద్ధాన్ని పొడిగించి ప్రత్యర్థిని బలహీనపర్చడం ఒక మార్గం. దీంతో ఇరాన్‌పై దాడి చేయాలనుకు న్నవారు ఆలోచనలో పడతారు” అని పేర్కొన్నారు.

# సాందీపనిలో సక్సెస్ బాట..!





- రాష్ట్ర స్థాయి ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు
- అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (జనంసాక్షి) :** కామారెడ్డి పట్టణంలోని సాందీపని కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కామారెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా హైదరాబాదులోని బంజారా కొమరం భీం భవన్లో ఘనంగా సన్మానించారు. ఇంటర్మీడియట్ బైపీసీ ప్రథమ సంవత్సరంలో సాందీపని కళాశాలకు చెందిన ఐమాన్ మసీర 440 మార్కులకుగాను 439 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించారు. అత్యుత్తమ మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల ఆమెను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అభినందించారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఆస్మా జబీన్ రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించి విశేష ప్రతిభను కనబరిచారు. ఇద్దరు విద్యార్థుల ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం వారిని ఘనంగా సత్కరించి, ప్రోత్సాహకంగా ల్యాప్‌టాప్‌లను అందజేసింది. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించడం పట్ల సాందీపని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐమాన్ మసీర, ఆస్మా జబీన్లను పలువురు ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, కళాశాల యాజమాన్యం అభినందిస్తూ.. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## భూసార పరీక్షలపై అవగాహన సదస్సు

**షాబాద్, ఆగస్ట్ 13(జనం సాక్షి);** రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కెవివై) కేంద్ర ప్రభుత్వ పథకంలోని నేల ఆరోగ్య మరియు భూసార ప్రాముఖ్యతలపై రంగారెడ్డి జిల్లా భూసార పరీక్ష కేంద్రం రాజేంద్రనగర్ వ్యవసాయ అధికారులు సునీత, రాజేష్ కుమార్ గురువారం షాబాద్ మండల పరిధిలోని పీఎంశ్రీ పాఠశాల, మోడల్ స్కూల్ కు చెందిన యాభై మంది విద్యార్థులకు మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర తో కలిసి భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా భూసార పరీక్ష కేంద్రం రాజేంద్రనగర్ వ్యవసాయ అధికారులు సునీత, రాజేష్ కుమార్ మాట్లాడుతూ... భూమి యొక్క నాణ్యతను, భూమిలో ఉన్న పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, కార్బన్ వంటి పోషకాలతో పాటు భూమిలోని ఆమ్లత్వం (పీహెచ్) ఎలక్ట్రికల్ కండక్టివిటీ(ఈసీ) తదితర అంశాలు ఏ మోతాదులో ఉన్నాయో తెలుసుకునే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా పరీక్షలు చేసి చూపించారు. భూమిలో పెరుగుతున్న కాలుష్యాన్ని, భారీ లోహాల కాలుష్యాన్ని ఎలా తగ్గించాలి, భూమికి అవసరమైన పోషక విలువలను ఏ విధంగా అందించాలి అనే అంశాలను కూడా ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయులు రాజ్ కుమార్, రాఘవేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి బాబ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి విక్రయిస్తుండగా
## యువకుడి అరెస్ట్

**120 గ్రాముల గంజాయి స్వాధీనం**

**శంకర్‌పల్లి, ఆగస్టు 13 (జనం సాక్షి) :**



గంజాయిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని మోకిల పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మోకిల సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని దూల్‌పేట్‌కు చెందిన హిమాంషు తివారి(24) గురువారం సాయంత్రం దూల్‌పేట్‌లోని బల్లు అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేశాడు. అనంతరం శంకర్‌పల్లి మండలం మీరాగూడ పరిధిలోని మియాఖాన్‌గడ్డలో గంజాయిని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా, అందిన సమాచారంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. యువకుడి వద్ద ఉన్న 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

### స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం చేయూత

**దసరా నాటికి పసుపు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించాలి: ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్**

**బంట్వారం, ఆగస్టు 13 (జనంసాక్షి):** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ అన్నారు. బంట్వారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు పొదుపుతో పాటు ఆదాయ మార్గాలను పెంచుకోవాలని, ఇందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.

ఇప్పటికే మంజూరైన రూ.25 లక్షల పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను దసరా నాటికి ప్రారంభించాలని అధికారులను, మహిళా సంఘాలను ఆదేశించారు. ప్రాసెస్ చేసిన పసుపుకు ప్రత్యేక బ్రాండ్ ఏర్పాటు చేసి మార్కెటింగ్ ద్వారా అధిక లాభాలు పొందాలని సూచించారు. అనంతరం బీసీ హాస్టల్ భవనం వద్ద యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్, డీహెచ్ఎస్‌వో సత్తార్, అదనపు డీఆర్డీవో నర్సింహులు, ఎంపీడీవో రాములు, ఏపీఎం ఆనంద్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భ్రమరాంభ, సీసీలు ప్రకాశ్, నర్సింహులు, అరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేశ్వరి నగర్ సమస్యల పరిష్కారానికి తలసాని హామీ

**అమీర్‌పేట:** ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరించి ఇబ్బందులు తొలగిస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. అమీర్‌పేట సత్యం థియేటర్ సమీపంలోని రాజేశ్వరి నగర్ వాసులు బుధవారం మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి కాలనీలోని సమస్యలను వివరించారు. దీంతో స్పందించిన ఆయన గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కలుషిత నీటి సరఫరాపై స్థానిక మహిళలు ఫిర్యాదు చేయగా, సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరగా, ముందుగా డ్రైనేజీ, వాటర్‌లైన్లలో లీకేజీలను పరిశీలించి అనంతరం రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ స్తంభాలపై ఇష్టారీతిన ఏర్పాటు చేసిన ప్రైవేటు కేబుల్ వైర్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలపగా, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదన్న ఫిర్యాదుపై రెగ్యులర్‌గా శానిటేషన్ పనులు జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని తలసాని హామీ ఇచ్చారు. సమస్యలు విన్నవించిన వెంటనే కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు రాజేశ్వరి నగర్ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, మేనేజర్ మౌనిక, శానిటేషన్ డీఈ వెంకట్, నామన శేషుకుమారి, హన్మంతరావు, నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- 409 వాహనాల తనిఖీ.. 231 కేసులు నమోదు

**ఉప్పల్, ఆగస్టు 13 (జనం సాక్షి):** ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ఉప్పల్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ పర్యవేక్షణలో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, ఇళ్లను తనిఖీ చేశారు. ఐదుగురు రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. తనిఖీల్లో 5 దేశీయ ఎల్‌పీజీ సిలిండర్లు, 4 ద్విచక్ర వాహనాలు, 100 మద్యం బాటిళ్లు, 10 గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు 409 వాహనాలను తనిఖీ చేసి 231 కేసులు నమోదు చేయగా, 26 వాహనాలను డిటైన్ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# జక్కిడి రాంరెడ్డి కాలనీలో సమస్యల తిష్ట

### రోడ్డుపై పారుతున్న మురుగునీరు

- గుంతల మయమైన రోడ్లతో.. నరకయాతన అనుభవిస్తున్న కాలనీవాసులు
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని అధ్యక్షుడు పసుపులేటి నాగేందర్ విజ్ఞప్తి





**హయత్ నగర్, ఆగస్టు 13 (జనం సాక్షి) :**
హయత్ నగర్ మండల పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ జక్కిడికి రాంరెడ్డి కాలనీలో మౌలిక వసతుల సమస్యలు స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కాలనీలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉండటంతో పాటు, పలు ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు నిత్యావసర పనుల కోసం రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కాలనీలోని రహదారి పక్కన మురుగు నీరు నిలిచిపోయిన గుంతలు, చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలు పేరుకు పోవడం పారిశుధ్య నిర్వహణపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది. వర్షాలు కురిసిన సమయంలో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ డ్రైనేజీ నీటితో దోమలు వృద్ధి చెందే పరిస్థితి ఏర్పడి, ప్రజారోగ్యంపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

ఇక కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో సరైన రహదారి సౌకర్యం లేకపోవడం, గుంతలు ఏర్పడటం, మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల చిన్నారులు, వృద్ధులు, మహిళలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, పారిశుధ్య వాహనాలు వంటి సేవలు సైతం సులభంగా చేరుకునేలా రహదారులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితులను బట్టి చూస్తే, కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నిల్వ నీటిని తొలగించడం, చెత్తను పూర్తిగా తొలగించడం, రహదారులను చదును చేసి నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేపట్టడం అత్యవసరంగా కనిపిస్తోంది. అలాగే కాలనీ పరిసరాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంగా జక్కిడికి రాంరెడ్డి కాలనీ అధ్యక్షులు పసుపులేటి నాగేందర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కేవలం తాత్కాలికంగా నీటిని తొలగించడం లేదా చెత్తను శుభ్రం చేయడం కాకుండా, మురుగు నీరు నిల్వ కాకుండా శాశ్వత డ్రైనేజీ పరిష్కారం, పక్కా రహదారులు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించే విధానం కాకుండా, అధికారులు కాలనీలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలు పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో వారికి కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని వారు పేర్కొంటున్నారు.

బిఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తున్న నేపథ్యంలో జక్కిడికి రాంరెడ్డి కాలనీ సమస్యలను కూడా సంబంధిత ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని తక్షణ పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీని సందర్శించి, సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి అవసరమైన నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి జక్కిడికి రాంరెడ్డి కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## నూతన ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలి

**ఇక్ఫాయి చైర్‌పర్సన్ శోభారాణి యశస్వి**

**శంకర్‌పల్లి, ఆగస్టు 13 (జనం సాక్షి) :**
నూతన ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలని ఇక్ఫాయి కళాశాల చైర్‌పర్సన్ శోభారాణి యశస్వి అన్నారు. ఇక్ఫాయి కళాశాలలో గురువారం కౌన్సిల్‌ఆఫ్‌ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో 2026-జోన్ 3 కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమానికి ఇక్ఫాయి వేదికగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ,మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి 73 కళాశాలలకు చెందిన 130 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు స్వీయ ప్రేరణతో ఉన్నత లక్ష్యం వైపు వడివడిగా నడవాలని సూచించారు. దినోత్సవమైన ఆలోచనలతోనే విద్యార్థులు ఆర్కిటెక్చర్ రంగంలో రాణిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయి రిజిస్ట్రార్ విజయ లక్ష్మి, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ మహేంద్ర హెచ్. సోనావానే, ప్రొఫెసర్ శ్రీదేవి, ప్రొఫెసర్ సోహన్ బిస్వాస్ ఉన్నారు.

## గర్భిణి మహిళ ఉరేసుకుని మృతి

**గంభీరావుపేట, ఆగస్టు 13 (జనంసాక్షి):**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొంతల లావణ్య (30) గురువారం సాయంత్రం ఉరేసుకుని మృతి చెందింది. ఆమె నిండు గర్భిణిగా ఉన్నట్లు సమాచారం. లావణ్యకు భర్త సురేష్‌తో పాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





## అల్లిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**రాయికల్ ఆగస్టు13 జనం సాక్షి:** రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో గురువారం రోజున ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన మరియు భూమిపూజ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న 3.50 మూడు లక్షల 50 వేల రూపాయలతో పరారీ గోడ మరియు ఐదు లక్షల రూపాయలతో కిచెన్ షెడ్ నిర్మాణం మరియు నాలుగు లక్షల రూపాయలతో మరుగుదొడ్డి నిర్మాణం మరియు నాలుగు లక్షల రూపాయలతో అంగన్వాడి భవన మరమ్మత్తు మరియు సిసిరోడ్డుకు భూమి పూజ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంభారీ గౌతమి వెంకటేష్, ఉపసర్పంచి వినయ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు గ్రామ యువత మండల పరిధిలోని గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్లు, మాజీ కో ఆప్షన్ మెంబర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల భూములు మాదిగలకే కేటాయించాలి

- సర్వే నంబర్ 255/1లో బాధిత రైతులకు అండగా నిలుస్తాం : ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్‌నగర్, ఆగస్టు 13 (జనం సాక్షి):**
సర్వే నంబర్ 255/1లో ఉన్న మాదిగల భూములను మాదిగలకే కేటాయించాలని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్ హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీ సమీపంలోని సర్వే నంబర్ 255/1లో మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమి ఉన్నట్లు తెలిపారు. అందులో సుమారు 56 ఎకరాల భూమిని రైతులు తమ అవసరాల నిమిత్తం విక్రయించగా, మిగిలిన 18 ఎకరాల భూమిలో కొంత భాగాన్ని రైతులు సాగు చేసుకుంటున్నారని, మరికొంత భూమిని తమ అవసరాల కోసం విక్రయించినట్లు వివరించారు. ప్రస్తుతం కొంత భూమి ఖాళీగా కనిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందన్న ఆందోళనతో పలువురు బాధిత రైతులు, కొనుగోలుదారులు ఇటీవల దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు.

ఈ నేపథ్యంలో సుధీర్ రెడ్డి గురువారం సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి బాధిత రైతులు, కొనుగోలుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పోరాడుతామని ఆయన హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఇదే ప్రాంతంలోని రైతుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులకు ఉన్న హక్కులను పరిరక్షించకుండా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని సుధీర్ రెడ్డి అన్నారు. పేదలు, రైతుల భూములు వారికి దక్కేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. భూముల విషయంలో రైతులు, కొనుగోలుదారుల సమస్యలను అధికారులు సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు. భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్, మల్లీశ్వరి రెడ్డి, ప్రదీప్, మధు, ఇంద్రకరణ్, మల్లేష్‌తో పాటు రైతులు నగేష్, స్కైలాబ్, శ్రీరాములు, శ్యామ్, ప్రవీణ్, గంగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా శంకర్‌పల్లి-మోమిన్‌పేట రహదారి





- గుంతలమయంగా మారిన 20 కిలోమీటర్ల రోడ్డు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థలో నంది వాగు వంతెన
- రోడ్డు నిర్మాణంపై స్పీకర్ చొరవ చూపాలని ప్రజల విజ్ఞప్తి

**బంట్వారం, ఆగస్టు 13 (జనం సాక్షి):** హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి మీదుగా మోమిన్‌పేట, బంట్వారం, వికారాబాద్ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట వరకు సుమారు 30 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిలో లక్ష్మారెడ్డిగూడ గేటు సమీపం వరకు ఇటీవల రోడ్డు నిర్మాణం జరిగినప్పటికీ, అక్కడి నుంచి మోమిన్‌పేట వరకు సుమారు 20 కిలోమీటర్ల మార్గం గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణకు అనుమతులు వచ్చాయని ఏళ్లుగా చెబుతున్నప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీమలదరి, దేవరంపల్లి, మోమిన్‌పేట చిలుకవాగుపై వంతెనలు నిర్మించినప్పటికీ ప్రధాన రహదారి పరిస్థితి మాత్రం మారలేదని పేర్కొంటున్నారు. మోమిన్‌పేట నంది వాగుపై ఉన్న పురాతన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. వంతెనపై వరద నీరు ప్రవహించే సమయంలో పోలీసులు రాకపోకలను నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గత ఐదారు సంవత్సరాల్లో ఈ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో పాటు, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టడంతో రహదారి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశించారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి బంట్వారం, మోమిన్‌పేట, మర్పల్లి, కొండపల్లి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో ఈ ప్రాంతాల అభివృద్ధి కూడా మందగిస్తోందని, పెట్టుబడులు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలపై ప్రభావం పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా శంకర్‌పల్లి-మోమిన్‌పేట రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేసి, నంది వాగు వంతెనను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# 22-ఏ భూముల సమస్యలకు పరిష్కారం చూపాలి

**కలెక్టర్ మనూ చౌదరిని కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్, ఆగస్టు 13 (జనం సాక్షి):**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో 22-ఏ జాబితాలో ఉన్న భూముల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని కలిసి సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో భూములు 22-ఏ జాబితాలో ఉండటంతో క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ఇతర అవసరాల కోసం భూ యజమానులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 22-ఏ భూముల సమస్యను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. భూములకు సంబంధించిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అర్హులైన ప్రజలకు న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

# పోలీసుల పేరుతో సైబర్ మోసాలు.. ఇద్దరి అరెస్ట్

- గూగుల్, టెలిగ్రామ్ ద్వారా ఫోన్ నంబర్ల సేకరణ
- పోలీసు అధికారులుగా పరిచయం చేసుకుని డబ్బుల వసూలు
- తెలంగాణ, ఏపీలో 28కిపైగా కేసులు
- మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, రూ.18 వేల నగదు స్వాధీనం



**చందుర్తి, ఆగస్టు 13 (జనంసాక్షి):** పోలీసు అధికారుల పేరుతో ప్రజలను మోసం చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా నిందితులను చందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మోతె మండలానికి చెందిన కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేటకు చెందిన కట్కూరి శరత్‌కుమార్ (31) ప్రస్తుతం హైదరాబాద్‌లోని మీర్‌పేట్ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరు గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్ల ఫోన్ నంబర్లను సేకరించి, ఆయా నిర్వాహకులకు పోలీసు అధికారులుగా పరిచయం చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తమను ఎఎస్సై శ్రీనివాస్‌రెడ్డిగా పరిచయం చేసుకుని, పోలీసు అధికారికి అత్యవసరంగా ఆసుపత్రి ఖర్చుల కోసం డబ్బులు అవసరమయ్యాయని చెప్పి ఫోన్‌పే ద్వారా నగదు పంపించాలని బాధితులను నమ్మించేవారని తెలిపారు. ముందుగా పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి తమ వాహనం లేదా బోర్‌బండి మరమ్మతులకు వచ్చిందని, తమ సార్ డబ్బులు పంపిస్తారని చెప్పి వారి ఫోన్ నంబర్ తీసుకునేవారు. అనంతరం ఆ నంబర్‌ను బాధితులకు ఇచ్చి ఆన్‌లైన్‌లో డబ్బులు బదిలీ చేయించుకుని, ఆ తర్వాత పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి నగదుగా తీసుకునేవారని వివరించారు. ఇదే విధంగా చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు ఫోన్ చేసి, తాము చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి ఎఎస్సై శ్రీనివాస్‌రెడ్డిగా మాట్లాడుతున్నామని, తన బాబు అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో ఉన్నాడని చెప్పి రూ.70 వేలు అత్యవసరంగా కావాలని నమ్మించారు. నిందితులు ఇచ్చిన పెట్రోల్ బంక్ ఖాతా నంబర్‌కు పెంటయ్య రూ.70 వేలు బదిలీ చేయగా, అనంతరం ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నేరం ద్వారా సమకూరిన సొమ్ములో భాగంగా రూ.18 వేల నగదు, మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 28కిపైగా కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసిన సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది అనిల్, గంగారెడ్డిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

# భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఫర్నిచర్, బెంచీలు ఎక్కువ ఉంటే మరో స్కూల్‌కు తరలించాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీరు (వాటర్ డిస్పెన్సరీలు) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు. ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది (సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించారు. అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకుని, పాఠశాలలో వృధాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటం పై అసహన వ్యక్తం చేశారు. ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్ ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు.

**అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన..**

డాక్టర్ స్ట్రీట్‌లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్, విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి, పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

# నిబద్ధతతో విధులు.. ప్రజలకు మెరుగైన సేవలు

## ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా పనిచేయాలి



**బొంరాస్‌పేట, ఆగస్టు 13 (జనంసాక్షి):** నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యత అని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. గురువారం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆమె శాంతిభద్రతలు, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవన పనులను పరిశీలించి, సిబ్బంది, ప్రజలకు అందుబాటులో ఉండేలా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందిస్తూ ప్రజల పట్ల మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీస్‌శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం కలిగేలా పోలీసింగ్ కొనసాగించాలన్నారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యమైన దర్యాప్తుతో కేసులను పరిష్కరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను పటిష్ఠం చేసి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి, ఎస్సై బాల వెంకటరమణ, ఏఎస్సైలు రాములు, ఆనంద్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపాడు సందర్శనకు నిరంజన్‌రెడ్డి.. అడ్డుకున్న ఏపీ పోలీసులు

## రైతులకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- హైవేపై మాజీ మంత్రి నిరసన
- తెలంగాణ నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపణ
- పాలమూరు ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్





**వనపర్తి బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి):** పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను సందర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఏపీ పోలీసులు జూపాడు బంగ్లా జాతీయ రహదారి వద్ద అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ నిరంజన్‌రెడ్డి హైవేపై నిరసన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే పోతిరెడ్డిపాడు సందర్శనకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను ఏపీకి తరలిస్తున్నారని, తెలంగాణ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగేలా నీటి పంపిణీ జరగకూడదని అన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా గ్రావిటీతో రోజుకు నాలుగైదు టీఎంసీల వరకు నీటిని తరలించే అవకాశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో నీటిని ఎత్తిపోసేందుకు మోటార్లపై ఆధారపడాల్సి వస్తోందని, ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీలో వ్యత్యాసం ఉందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం రెండు రాష్ట్రాలపైనా ఒకే విధంగా ఉంటుందని, ఏపీకి నీటిని విడుదల చేస్తున్నప్పుడు తెలంగాణ రైతులకు ఎందుకు నీరు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్లను సక్రమంగా నడపడం లేదని ఆరోపించారు. 162 కిలోమీటర్ల కాలువలో 102 కిలోమీటర్ల వరకు నీరు చేరలేదని అన్నారు. జూరాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో జూరాల ఆయకట్టు, లిఫ్ట్‌లకు నీటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో రైతులకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో శ్రీశైలంలో సుమారు 100 టీఎంసీల నీరు ఉన్న సమయంలోనూ రైతులకు 40 టీఎంసీల నీటిని అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు నుంచి ఎనిమిది, తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితిని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు సంబంధించిన ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లిన తమను అడ్డుకోవడం సరికాదని, నీటి పరిస్థితిని పరిశీలించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికే వచ్చామని స్పష్టం చేశారు. పాలమూరు ప్రాంతానికి దక్కాల్సిన నీటి విషయంలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యతగా వ్యవహరించాలని, తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనుల పురోగతి పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**దుద్యాల, ఆగస్టు 13 (జనం సాక్షి):**
హకీంపేట్ సమీపంలో చేపడుతున్న వివిధ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం దుద్యాల మండలం హకీంపేట్‌లో చేపడుతున్న ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రతి ఒక సైట్‌ను పరిశీలించారు.నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు,మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల, ఇంజనీ రింగ్, మెడికల్, నర్సింగ్, కళాశాలలు, ఫిజియోతెరఫీ, వెటర్నరీ కళాశాల, యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం గా జరగాలని, నిర్మాణ పనులన్ని యు నాణ్యతో ఉండాలని, ప్రతి వారం నిర్ధారించిన లక్ష్యం మేరకు పనుల పురోగతి ఉండాలన్నారు. ప్రతి సైట్ కు సంబంధించిన ప్లాన్ ను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నిర్మాణ పనులను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రా క్టర్లు, అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమం లోట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, కోడంగల్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ కిషన్ ,ఇడబ్ల్యుఐడిసి అధికారులు,ఇంజనీరింగ్ అధికారులు,సంబంధిత అధికారులు ఉన్నారు.

# రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్ పర్సన్ రాగం సుజాత యాదవ్ అకాల మృతి

శేరిలింగంపల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్‌పర్సన్, ప్రముఖ సామాజిక సేవకురాలు రాగం సుజాత యాదవ్ గురువారం సాయంత్రం అకాల మృతి చెందడం జరిగింది. అకస్మాత్తుగా అనారోగ్యం పాలై యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచినట్లు రాగం సుజాత యాదవ్ కుటుంబీకులు తెలియజేశారు. 1974 అక్టోబర్ 10న జన్మించిన రాగం సుజాత యాదవ్ చిన్న వయసులోనే అకాల మృతి చెందడం తమను తీవ్రంగా కలిసి వేసిందని శేరిలింగంపల్లి డివిజన్ వాసులు, స్థానిక మహిళా లోకంతోపాటు రాగం కుటుంబ అభిమానులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంతో సౌమ్యురాలైన రాగం సుజాత నాగేందర్ యాదవ్ అందరితో కలుపుగోలుగా ఉంటూ స్థానికంగా ప్రతి ఇంటి కుటుంబ సభ్యురాలిగా మసులుకునేదని, ఆమె మరణం అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని చాలామంది అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్లలోని వర్టెక్స్ కింగ్‌స్టన్ స్వగృహంలో గురువారం సాయంత్రం నుండి సందర్శకుల దర్శనార్థం పార్థివదేహాన్ని ఉంచినట్లు సుజాత యాదవ్ కుటుంబసభ్యులు తెలియజేశారు. నేడు ఉదయం 11 గంటలకు నల్లగండ్లలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించబడతాయని, సుజాత యాదవ్ కడసారి చూపును కోరుకునే వారంతా తప్పకుండా సగృహానికి లేదా స్మశాన వాటికి వద్దకు భారీగా తరలిరావాలని ఆమె అభిమానులు విజ్ఞప్తి చేశారు.

# మెడికవర్‌లో ప్రతినెల 2వ గురువారం ఉచిత క్యాన్సర్ శిబిరం

- మొదటి శిబిరంలో 186 మందికి పరీక్షలు చేయగా, 26 మందికి పాజిటివ్
- హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్టులు డాక్టర్ అన్వేష్ , డాక్టర్ నీలేష్ , డాక్టర్ స్నేహ




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి) :**
క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధి నుంచి త్వరగా బయటపడే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్టులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం రోజు నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి మొత్తం 186 మంది హాజరై క్యాన్సర్ సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఇకపై ప్రతి నెల రెండో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కరీంనగర్లో విలేకరుల సమావేశంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు మాట్లాడుతూ... కరీంనగర్‌లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. మహిళల్లో ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ రావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అయితే క్యాన్సర్ లక్షణాలు స్పష్టంగా బయటపడకముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి తగిన చికిత్స అందించవచ్చన్నారు. క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేస్తే వ్యాధి దశ పెరిగే కొద్దీ తీవ్రత కూడా పెరుగుతుందని, తద్వారా చికిత్స మరింత క్లిష్టతరంగా మారే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరించారు. ఊబకాయం బారిన పడకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా కొంతమందినైనా కాపాడాలనే ఉద్దేశంతో మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహిస్తోందని వైద్యులు తెలిపారు. ముందస్తు గుర్తింపు, సరైన సమయంలో చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్‌హెడ్ సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, పీఆర్ అబ్దుల్‌వకీల్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రైవేట్ బడులకు స్వస్తి.. ప్రభుత్వ బడిలోకి విద్యార్థులు

## ఆదర్శంగా చీకూర్ధి గ్రామ సరిహద్దు బడి

### ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సౌకర్యాలు

**న్యాల్‌కల్, ఆగస్టు 13, (జనం సాక్షి) :**
రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో.. విద్య, వైద్యం, అధ్వానంగా రోడ్లు, అరకొర సౌకర్యాలతో పల్లె ప్రజానీకం సతమతమవ్వడం చూస్తూ ఉంటాం. ప్రభుత్వ బడుల విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సౌకర్యాలను సమకూరుస్తున్న ఫలితాలు మాత్రం అందని ద్రాక్షగానే మారుతోంది. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థునుల సంఖ్య అధికంగా తగ్గడం, అరకొరగా ఉపాధ్యాయ సిబ్బంది, కనీస సౌకర్యాలకు నోచుకోక విద్యార్థునులు సతమతమవడం చూస్తూ ఉంటాం..? ఐతే అందుకు భిన్నంగా..! తెలంగాణ – రాష్ట్ర సరిహద్దు, న్యాల్ కల్ మండలం, చీకూర్థి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాత్రం ఆదర్శంగా నిలుస్తోంది. స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పోషకుల సహకారంతో పాఠశాల విద్యాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది.

**చేర్పించేందుకు విశేషంగా కృషి**

న్యాల్ కల్, రాయికోడ్ మండలాల్లోని వివిధ ప్రవేట్ బడులకు చెందిన 30 గురు విద్యార్థునులు ప్రైవేట్ బడులకు స్వస్తి పలికి మండలంలోని చీకూర్ధి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రవేశం పొందారు. బడిబాట కార్యక్రమం, స్థానిక సర్పంచ్ రమేష్, పలువురు పోషకులు, యువకుల సహకారంతో 1వ తరగతి నుండి 8వ తరగతికి చెందిన 30 గురు విద్యార్థునులు ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు విశేషంగా కృషి చేయడం ఆదర్శనీయం. రాయికోడ్ మండలంలోని ఓ ప్రవేట్ విద్యాసంస్థలో విద్యనభ్యసిస్తున్న.. సర్పంచ్ రమేష్ కుమారుడు అఖిలేష్ (8వ తరగతి విద్యార్థి)ని సైతం ప్రభుత్వ బడిలో చేర్చడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పోషకులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల అభ్యున్నతికి సర్పంచ్, గ్రామానికి చెందిన ప్రముఖులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు హైదరాబాద్ లోని పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా నిధులను సమకూర్చుకొని పాఠశాలలో పలు సౌకర్యాలను ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల హెచ్ఎం ఎస్.రేష్మ హాస్మిన్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



**పాఠశాల అభ్యున్నతికి అండగా ఉంటాం : సర్పంచ్ రమేష్**



*తెలంగాణ – కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో పాఠశాల ఉన్నప్పటికిని, పాఠశాల అభ్యున్నతికి అండగా ఉంటాం. స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు శ్రీనివాస్ రెడ్డి, తదితరుల చొరవతో పాఠశాలలో పలు సౌకర్యాలను ఈ పాటికే సమకూర్చాం. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రవేట్ పాఠశాలలకు చెందిన 30 గురు విద్యార్థునులను ప్రభుత్వ బడిలో చేర్చాం. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థునులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తమవంతుగా సహకారాన్ని అందిస్తాం.*

**శతశాతం ఉత్తీర్ణత**

గత కొన్ని సంవత్సరాలుగా పదవ తరగతిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థునులు శతశాతం ఉత్తీర్ణులయ్యారు. 2024 – 25, 26 విద్యా సంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో 6వ తరగతి నుండి10వ తరగతి వరకు 76 విద్యార్థునుల్లో.. అందున 10వ తరగతిలో 20గురు విద్యార్థునులు విద్యనభ్యసిస్తున్నారు.

# నీళ్లు మా హక్కు.. నాలుగు నెలలుగా లేదు దిక్కు!

- ఖాళీ బిందెలతో మహిళల ధర్నా
- వెంటనే తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్



**కీసర (జనంసాక్షి) :** గత నాలుగు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు గురువారం నాగారం డివిజన్ బాలాజీనగర్ కాలనీలో ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసిన సమస్యను పరిష్కరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలాజీనగర్ కాలనీలో నాలుగు నెలలుగా తాగునీరు అందకపోవడంతో రోజువారీ అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. మహిళలకు మద్దతుగా సామాజిక కార్యకర్త అక్కాల సురేష్‌కుమార్ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పైపులైన్ బ్లాకేజీలను పరిశీలించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నాలుగు నెలలుగా ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నా సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. తాగునీరు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, అధికారులు ఇకనైనా తక్షణ చర్యలు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

- 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- ప్రజల రాకపోకలపై ప్రత్యేక చర్యలు
- జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్






**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి):** ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో సుమారు 1,500 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, పార్కింగ్ ప్రాంతాలు, అంబేద్కర్ స్టేడియం సహా పలు ప్రాంతాలను అదనపు ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి పరిశీలించారు. సభకు వచ్చే బస్సులు, నాలుగు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు, మీడియా వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను కేటాయించినట్లు ఎస్పీ తెలిపారు. సభా ప్రాంగణంలో ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## వాహనాలకు ప్రత్యేక పార్కింగ్

ఆందోల్ నియోజకవర్గం నుంచి సభకు వచ్చే బస్సులకు గంజీ మైదాన్లో పార్కింగ్ కేటాయించారు. నారాయణఖేడ్, జిన్నారం, హత్నూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పార్కింగ్ కేటాయించారు. జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చే బస్సులకు హాస్టల్ గడ్డ ఈద్గా వద్ద పార్కింగ్ కేటాయించారు. పటాన్‌చెరువు నియోజకవర్గం, ఇందిరేశం, ఈసనాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు న్యూ బస్ స్టాండ్లో పార్కింగ్ కేటాయించారు. 4 వీలర్ వాహనాలకు మహబూబ్ సాగర్ చెరువు కట్ట, ప్రభుత్వ బాలికల పాఠశాల లో పార్కింగ్ ఏర్పాటు, ద్విచక్ర వాహనాలకు ప్రభుత్వ బాలుర పాఠశాలలో పార్కింగ్ ఏర్పాటు, మీడియా వాహనాలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పార్కింగ్ కేటాయించారు. సభకు వచ్చే బస్సులు, 4-వీలర్, ద్విచక్ర వాహనాలు తమకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులకు సహకరించవలసిందిగా సూచించారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ఫిలిప్పీన్స్ విధానాల అధ్యయనం

- 17 నుంచి 21 వరకు ఫిలిప్పీన్స్ పర్యటన
- ఇద్దరు ఎమ్మెల్యేలతో సహా 11 మంది సభ్యుల బృందం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీకి చెందిన 11 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఈ నెల 17 నుంచి 21 వరకు ఫిలిప్పీన్స్‌లో అధ్యయన పర్యటన చేపట్టనుంది. ఈ విషయాన్ని కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి లతో పాటు కమిటీ సభ్యులు పాల్గొంటారు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల సంక్షేమం, రక్షణ కోసం ఫిలిప్పీన్స్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, సంక్షేమ కార్యక్రమాలు, సంస్థాగత వ్యవస్థలు, ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా లోని ఇండియన్ ఎంబసీ, వివిధ వలస కార్మిక సంఘాలు, ప్రభుత్వ సంస్థలను సందర్శిస్తారు.




# కొడంగల్ ఎత్తిపోతల అవకతవకలు

## లోకాయుక్తకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఫిర్యాదు



**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 13(జనం సాక్షి):** వికారాబాద్ జిల్లాల పరిధిలో చేపడుతున్న మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవక తవకలు, అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని నారాయణపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేం దర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహ న్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లు గురువారం లోకా యుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్య క్షులు ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఏం.ఎన్.కే. ఎల్.ఐ.ఎస్ లో ముఖ్యంగా నారాయణపేట మండలం పేరపల్ల గ్రామ శివారులో చేపట్టిన భూముల సేకర ణలో పెద్ద ఎత్తున అక్రమా లు చోటు చేసుకున్నట్లు తెల్సుందని, ముఖ్యంగా దొంగ పాస్ బుక్ లతో నష్ట పరిహారం ఎత్తుకునేందుకు కాంగ్రెస్ నాయకులు పన్నా గంతో దండు కునేందుకు ప్రణాళికలు రూపొందించి నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. అంతే కాకుం డా పేరపల్ల శివారులోని జయమ్మ చెరువులో నీరు నిల్వ చేయడం వల్ల కొంత మంది రైతులకు సంబంధిం చి భూములు కొల్పోకున్న, భూములు కోల్పోతున్నట్లు పేర్కొనడం, సర్వే నంబర్లూ ఒక చోట ఉంటే భూములు ఒక చోట ఉన్నట్లు అధికా రులు చెప్పడం రైతులను అయోమయానికి గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్టు పనుల్లో పారదర్శకత ఉండేలా చర్య లు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విచార ణలో అవినీతి, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు తేలితే సంబంధిత అధికా రులపై, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ప్రతి రూపాయి ప్రజాధనం సక్ర మంగా వినియోగించా ల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లోకాయుక్త విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాలని వారు కోరారు.










## రైలు ఢీకొని టీచర్ మృతి

**మహబూబాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. పుష్పుల్ రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.













Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370